ఫ్లైఓవర్‌తో తీరనున్న కష్టాలు

రూ.25 కోట్లతో నిర్మాణం

రేపు ప్రారంభించనున్న రైల్వేశాఖ సహాయ మంత్రి



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి

పెనుకొండ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద రైల్వేగేటుపై కొత్తగా నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికావడంతో వాహనదారుల కష్టాలు తీరనున్నాయి. ఈ రహదారి ద్వారా గతంలో ప్రతిరోజూ వేలాది వాహనాలు రైల్వే ట్రాక్ దాటి వెళ్లేవి. ఈ ట్రాక్‌పై ప్రతి అర గంటకు రైలు లేదా గూడ్స్ వెళ్తుంటాయి. ఆ సమయంలో గేటువేయడంతో ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోయేవి. రైలు వెళ్లిన తరువాత వాహనాలు గేటు దాటడానికి అర గంటకు పైగా సమయం పట్టేది. అంతలోపు మరో రైలు రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. పెనుకొండ మీదుగా 44వ జాతీయ రహదారి ఏర్పడటంతో భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా హైవేపై వెళ్లడంతో రైల్వేగేటువద్ద కొంతమేర వాహనాల రద్దీ తగ్గింది. పట్టణ సమీపంలో కియా పరిశ్రమ ఏర్పడటంతో రైల్వే గేటువద్ద మళ్లీ రద్దీ మొదలైంది. ఇదే సమయంలో రైళ్ల సంఖ్య కూడా పెరగడంతో తరచూ గేటువద్ద రద్దీ పెరగడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వాహనదారుల ఇబ్బందులను గుర్తించి 2019లో కేంద్ర ప్రభుత్వం రూ.25కోట్లతో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ప్రస్తుతం పూర్తిచేసింది.

ప్రారంభించనున్న రైల్వేశాఖ సహాయ మంత్రి

రైల్వే గేటుపై ఫ్లైఓవర్ బ్రిడ్జిని కేంద్ర రైల్వేశాఖ సహాయమంత్రి సోమణ్ణ చేతులమీదుగా ఆదివారం ఉదయం 10గంటలకు ప్రారంభిస్తున్నట్లు హిందూపురం ఎంపీ పార్థసారథి తెలిపారు. ఎన్నో ఏళ్లుగా బ్రిడ్జి నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న వాహనదారుల కష్టాలు తీరనున్నాయని ఆయన పేర్కొన్నారు.

గుంతలు లేని రహదారులే లక్ష్యం : ఎమ్మెల్యే



ఆర్టీసీ కొత్త సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

మడకశిరటౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలోనూ గుంతలు లేని రహదారులు చూడాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు ముందుకు వెళుతున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం అమరాపురం బస్టాండు ఆవరణంలో శ్రీశైలం పుణ్యక్షేత్రానికి మడకశిర నుంచి కొత్త ఆర్టీసీ సర్వీసులను ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి కొత్త బస్సు సర్వీసులను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క కొత్త సర్వీసును కూడా ప్రారంభించలేదన్నారు. రవాణా వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారని తెలిపారు. మడకశిర ఆర్టీసీ డిపో నుంచి విజయవాడ, శ్రీశైలం సర్వీసులను నడుపుతున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాలకు సైతం సంక్రాంతిలోపు గుంతలు లేని రహదారులుగా చూస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కమిషనర్ రంగస్వామి, డిపో మేనేజర్ సుబ్బారావు, నాయకులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగుల చెంతకే కంపెనీలు



ధర్మవరంలో 9న మెగా జాబ్‌మేళా పోస్టర్లు ఆవిష్కరించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

(7లో..)

• వామ్మో..!

రహదారి.. ఆ పక్కనే లోతైన చెరువును చూస్తుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. వాహనదారులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా.. చెరువులోకి దూసుకెళ్లడం ఖాయం. చెరువు, రహదారికి ఏమాత్రం దూరం లేదు. కనీసం రక్షణ గోడ లేదు. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదు.. జిల్లా కేంద్రం పరిధి ఎనుములపల్లిలోనే. ఎనుములపల్లి చెరువు పక్కనే బైపాస్ రోడ్డు వెళ్తోంది. తారు రోడ్డు, చెరువుకు మధ్య కనీసం మీటరు కూడా మట్టిరోడ్డు లేదు. వాహనదారులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా.. అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెరువులోకి పడిపోవడం ఖాయం. రోడ్డు పక్కనే దాదాపు 10 అడుగుల లోతు నీరు ఉంది. రక్షణ గోడలేకపోవడంతో ఎప్పుడేమి జరుగుతుందోనన్న ఆందోళన గ్రామస్థుల్లో నెలకొంది. గత ప్రభుత్వంలో రక్షణ గోడ ఏర్పాటు చేయాలని అధికారులను స్థానికులు కోరినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా రక్షణ గోడ ఏర్పాటు చేయకపోతారా అని స్థానికులు ఆశగా ఉన్నారు.

-పుట్టపర్తి(ఆంధ్రజ్యోతి)



రక్షణ గోడ ఏర్పాటు ఏదీ..?



చెరువు పక్కనే రోడ్డు

మస్టర్లలో మాయాజాలం..!



వలస కూలీలు పని చేసినట్లు నమోదు

ఉపాధి సిబ్బంది చేతివాటం

తూతూ మంత్రంగా సామాజిక తనిఖీలు

కదిరి అర్బన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పేదలకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకం కొందరు అక్రమార్కులకు ఆదాయవనరుగా మారింది. బెంగళూరు తదితర ప్రాంతాలకు వలస వెళ్లిన వారితోపాటు గ్రామంలో ఉంటూ ఉపాధి పనులకు రాని వారికి సైతం జాబ్‌కార్డులు సృష్టించి మస్టర్లు వేస్తూ లక్షలాది రూపాయలు ప్రభుత్వ సొమ్ము స్వాహా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దొంగమస్టర్లతో అధికారులకు మస్కా కొడుతూ కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమార్జనకు పాల్పడుతున్నారని బహిరంగంగా విమర్శలున్నాయి. ఉపాధి పథకం లో పనులు చేయకుండా వేతనాలు తీసుకునే కూలీల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. కదిరి మండలంలోని ఎగువపల్లి పంచాయతీకి చెందిన దంపతులు బెంగళూరుకు వలసపోయారు. గ్రామంలో 10086 జాబ్‌కార్డుతో ఉపాధి హామీ పథకం కింద పనులు చేసినట్లు రికార్డుల్లో నమోదు చేసి రూ. వేలల్లో డ్రా చేశారు. అదే గ్రామానికి చెందిన ఇద్దరు బెంగళూరు, మరొకరు అనంతపురంలో ఉన్నారు. వీరి పేర్లతో జాబ్‌కార్డులు సృష్టించి పనులు చేసినట్లు చూపించి బిల్లులు కాజేశారు. గ్రామ సర్పంచ్ భార్య పేరు మీద కూడా తప్పుడు మస్టర్లు వేసి సొమ్ము చేసుకున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లదే రాజ్యం..

ఉపాధి హామీ పథకం పక్కదారి పడుతోంది. ఫీల్డ్ అసిస్టెంట్లు చెప్పిందే వేదమన్నట్లుగా సాగుతోంది. మండల స్థాయి అధికారులు వారికి భయపడే పరిస్థితి నెలకొంది. దీంతో వారు ఇష్టారాజ్యంగా చేస్తున్నారు. 2019-24 మధ్య వైసీపీ నేతలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర ఉపాధి సిబ్బంది నిధులను కొల్లగొట్టారు. కూటమి ప్రభుత్వంలో అయినా వీటికి అడ్డుకట్ట పడుతుందనుకుంటే మళ్లీ అదే తరహాలో అక్రమాలకు బరి తెగిస్తున్నారు. పనికి వచ్చిన వారికే మస్టర్లు నమోదు చేయాల్సి ఉండగా.. ఫీల్డ్ అసిస్టెంట్లు పనులకు రానివారికి కూడా మస్టర్లలో నమోదు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. కదిరి మండలంలో 14 పంచాయతీలు ఉన్నాయి. అన్ని పంచాయతీల్లోనూ ఈ వ్యవహారం సాగుతోంది. క్షేత్రస్థాయిలో ఫీల్డు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది కుమ్మక్కై ప్రతి కూలి నుంచి రూ.200 నుంచి రూ.300 వరకు వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కువైట్, బెంగళూరు, అనంతపురం ప్రాంతాల్లో ఉండే వారి పేర్లతో జాబ్‌కార్డులు సృష్టించి మస్టర్లు వేసి చెరి సగం తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మండలంలో 14,788 మంది కూలీలుండగా, దాదాపు 12 వేలమంది ఉపాధి పనులకు హాజరవుతున్నారు.

తూతూమంత్రంగా సామాజిక తనిఖీలు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో జరిగే అక్రమాలు గుర్తించడంలో సామాజిక తనిఖీ (సోషల్‌ఆడిట్) బృందాలది కీలక పాత్ర. లేని కూలీల పేరుతో వేతనాలు కాజేసినా, తప్పుడు హాజరుతో అక్రమాలకు పాల్పడినా, తక్కువ విస్తీర్ణంలో చేసిన పనిని ఎక్కువగా చూపి నిధులు నొక్కేసినా, సామాజిక తనిఖీ బృందాలు గుర్తించి తగిన చర్యలకు సిఫార్సులు చేస్తారు. కంచే చేను మేసినచందంగా తనిఖీ బృందాల్లోని కొంతమంది అవకతవకలకు పాల్పడుతున్నారు. తనిఖీల పేరుతో ఒక్కొక్క పంచాయతీలో అక్కడ చేసిన పనుల విలువ ఆధారంగా క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి వాటాలు తీసుకుని లోపాలపై పెద్దగా దృష్టి సారించలేదన్న విమర్శలు ఉన్నాయి. తూతూమంత్రంగా తనిఖీలతో సరిపెడుతున్నారు. అధికారులకు అనుమానం రాకుండా ఒకటి రెండు పనుల్లో చిన్నచిన్నలోపాలు ఉన్నట్లు చూపించి మమ అనిపిస్తున్నారు. అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.





ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

విచారించి, చర్యలు తీసుకుంటాం

ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయిలో విచారించి, అక్రమాలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటాం.

- పోలప్ప, ఎంపీడీఓ

అర్హులందరికీ సదరం సర్టిఫికెట్లు

కలెక్టర్ టీఎస్ చేతన్



అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన వికలాంగులందరికి సకాలంలో సదరం సర్టిఫికెట్లు అందించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. నూతన సదరం సరిఫికెట్ల మంజూరు, ఎన్టీఆర్ భరోసా పింఛన్ రూ.15వేలు పొందుతున్న వారి ధ్రువపత్రాల పరిశీలనపై శుక్రవారం కలెక్టర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సదరం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులను గుర్తించి సకాలంలో మంజూరు చేయాలన్నారు. మంచానికి పరిమితమై, నడవలేని స్థితిలో ఉన్న పింఛన్‌దారుల సర్టిఫికెట్ల పరిశీలనకు జిల్లాస్థాయిలో వైద్య నిపుణులతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. వారానికి మూడురోజుల పాటు క్షేత్రస్థాయిలో ధ్రువపత్రాలను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఎంహెచ్ఓ ఫిరోజ్‌బేగం, డీసీహెచ్ఓ తిప్పేంద్రనాయక్, నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ట్రాన్స్‌ఫార్మర్లు

జిల్లా వ్యాప్తంగా 1800 మంజూరు

సీనియారిటీ ప్రకారం ఏర్పాటు

గ్రామీణ ప్రాంతాలకు 3 ఫేస్ కరెంటు

ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ ప్యానెల్స్

విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర



సురేంద్ర, ఎస్ఈ

హిందూపురం అర్బన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నాటికి రైతుల పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తామని విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర తెలిపారు. హిందూపురంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాకు కొత్తగా 1800 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయని వివరించారు. ఇందులో భాగంగా తొలి విడత 990 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. హిందూపురం నియోజకవర్గంలో ఈ నెల 9న అందించనున్నట్లు తెలిపారు. హిందూపురం మండలంలో కొత్తగా ఐదు సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1448 గ్రామాలకు త్రీఫేస్ విద్యుత్ అందిస్తామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందన్నారు. పొలాల్లో విద్యుత్ లేకపోయినా, వైర్లు తెగిపోయినా, ఫ్యూజులు పోయినా రైతులు సొంత ప్రయోగాలు చేయరాదని అన్నారు. సంబంధిత విద్యుత్ లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్, ఏఈలకు ఫోన్ చేయాలన్నారు. వారు అందుబాటులోకి రాకపోతే 1912కు కాల్‌చేస్తే ఈఈ, ఎస్ఈలకు కూడా అందుతుందన్నారు. సమస్యలు ఉన్న ప్రాంతాలకు వెంటనే అధికారులను పంపి పరిష్కరిస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు ఉన్న ఉచిత విద్యుత్ కనెక్షన్ల స్థానంలో త్వరలో ఉచిత సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో 65,204 ఎస్సీ, ఎస్టీ ఇళ్లు ఉన్నాయని, ఇందులో 30,204 ఇళ్లకు సర్వే చేసి రిజిస్టర్ చేశామన్నారు. మిగిలిన వాటిని కూడా ఈ నెల 10వ తేదీలోపు పూర్తి చేస్తామన్నారు.

పంచాయతీ నిధులు పక్కదారి

పని గోరంత... బిల్లులు కొండంత

ఏడాదిలో కోటికి పైగా నిధులు డ్రా

అధికారులు, నాయకుల కుమ్మక్కు

విచారణలో అక్రమాలు వెలికితీసేరా..?



సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నిధులు డ్రా చేసిన బిల్లు

7

సాగు...బాగు..!

హంద్రీనీవా, జీబీసీకి పుష్కలంగా నీరు



2023లో జీబీసీకి సాగు నీరు లేక ఎండి పోయిన ప్రధాన కాలువ



హంద్రీనీవా కాలువ కింద ప్రస్తుతం కళకళలాడుతున్న మిరప పంట



ఈ ఏడాది జీబీసీ ప్రధాన కాలువలలో పుష్కలంగా ప్రవహిస్తున్న సాగునీరు

పంటలతో కళకళలాడుతున్న ఆయకట్టు
వైసీపీ పాలనలో నవంబరుకే బంద్
ఫిబ్రవరి దాకా వస్తే గట్టెక్కుతామంటున్న రైతులు

విడపనకల్లు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం హంద్రీనీవా, జీబీసీల్లో పుష్కలంగా నీరు ప్రవహిస్తోంది. దీంతో ఆయకట్టు భూములు పంటలతో కళకళలాడుతున్నాయి. వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ పాలనలో 2023 నవంబరుకే జీబీసీకి సాగు నీరు బంద్ చేశారు. దీంతో రైతులు ఆగ్రహంతో రోడ్డెక్కి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. జనవరి 2024వరకు పోరాటాలు చేసినా అప్పటి ప్రభుత్వం హంద్రీనీవా నుంచి జీబీసీకి చుక్కనీరు కూడా ఇవ్వలేదు. దీంతో మిరప సాగు చేసిన రైతులు పంటను వదిలేశారు. కొందరు రైతులు ట్రాక్టర్ల ద్వారా పంటకు నీరు అందించారు. మరి కొంత మంది బిందెలతోను బక్కెట్లతోను మొక్కలకు నీరు పోసి కాపాడుకున్నారు. అయినా అత్యధిక మంది రైతులు లక్షల్లో పెట్టుబడులు నష్టపోయారు.

9వ కాలువలో నిండుగా నీరు

గడేకల్లు 9వ కాలువకు గత ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం చుక్క నీరు ఇవ్వలేక పోయింది. జీబీసీ ప్రధాన కాలువకు సాగు నీరు వస్తున్నా 9వ కాలువకు సాగునీరు రాక పోవటంతో ఆ కాలువ కింద ఉన్న నాలుగు వేల ఎకరాలు బీడు భూములుగా మారాయి. ప్రస్తుతం 9వ కాలువకు నిండుగా సాగు నీరు వస్తుండటంతో ఆ కాలువ కింద భూములు ఉన్న రైతులు మిరప, కంది, వరి, జొన్న పంటలు సాగు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 9వ కాలువలో పూడికతీత పనులను చేయించారు. దీంతో సాగు నీరు నిండుగా ప్రవహిస్తోంది.

జీబీసీలో 300 క్యూసెక్కుల నీరు

జీబీసీ ప్రధాన కాలువలో ప్రస్తుతం 300 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. పిల్ల కాలువలకు కూడా నీరు సమృద్ధిగా వస్తోంది. దీంతో పొలాల్లోని చిన్న పిల్ల కాలువలకు కూడా నీరు బాగా వస్తోంది. ఒకే సారిఎన్ని సాళ్లకు వదిలినా నీరు పంటకు సరిపడుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి సాగు నీరు ఫిబ్రవరి ఆఖరు వారకు వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం హంద్రీనీవా, జీబీసీ కాలువలకు పూర్తి స్థాయిలో సాగు నీరు వస్తుండటంతో నియోజకవర్గంలోని భూములన్నీ పంటలతో కళకళలాడుతున్నాయి. గత ఏడాది సాగు నీరు లేక ఎక్కడ చూసినా ఎండుతున్న పంటలే కనిపించేవి.

పుష్కలంగా నీరు



2023లో నవంబరు నెలలోనే నీరు ఆపేయడంతో సాగు చేసిన మిరప పంటను దున్నేశాము. ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడి కూడా రాలేదు. కనీసం ఒక్క తడికి నీరు ఇవ్వండి అని అడిగితే వైసీపీ నాయకులు పట్టించుకోలేదు. ప్రస్తుతం సాగు నీరు కాలువల్లో నిండుగా ప్రవహిస్తోంది. మిరప రైతులకు ఇబ్బంది లేకుండా నీళ్లు వస్తున్నాయి.

- హనుమంతు, మిరప రైతు, కరకముక్కల

బిందెలతో నీటిని పోశాం



నేను 2023లో హంద్రీనీవా పిల్ల కాలువ కింది 8 ఎకరాల్లో మిరప పంటను సాగు చేశా. అయితే సాగు నీరు నవంబరు నెలలోనే బంద్ చేశారు. దీంతో ట్రాక్టర్ల ద్వారా పంటకు నీటి తడులు ఇచ్చా. అయినా పంట దిగుబడి సరిగా రాలేదు. దాదాపు రూ. 10లక్షలు నష్టం వచ్చింది. ఈ ఏడాది హంద్రీనీవాలోను, జీబీసీలోను సాగు నీరు పుష్కలంగా ప్రవహిస్తోంది. అందుకే ఇప్పుడు కూడా హంద్రీనీవా కాలువ కింద మళ్లీ 8 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశా. పంట కూడా ఆశాజనకంగానే ఉంది.

- బొజ్జప్ప, మిరప రైతు, చీకలగురికి



2023లో సాగునీరు రాక ట్యాంకర్ల ద్వారా తడి ఇస్తున్నరైతులు

మొక్క జొన్న సాగు చేశా



జీబీసీకి సాగునీరు రాకపోవడంతో 2023లో ట్యాంకర్ల ద్వారా మిరప పంటకు తడులు అందించాం. అయినా దిగుబడులు రాక తీవ్రంగ నష్టపోయాం. ప్రస్తుతం జీబీసీకి సాగు నీరు పుష్కలంగా వస్తోంది. అందుకే పది ఎకరాల్లో మొక్క జొన్న సాగు చేశా. ఫిబ్రవరి చివరి వరకూ సాగు నీరు వస్తే మంచి దిగుబడి వచ్చి, ధరలు కూడా బాగా ఉండే అవకాశం ఉంది. దీంతో గత ఏడాది జరిగిన నష్టాన్ని కొంతైనా పూడ్చుకునే అవకాశం ఉంది.

- పవన్‌కుమార్, ఆర్ కొట్టాల

న్యూస్ బాక్స్

ఉచిత బస్సు ప్రయాణంపై అధ్యయనం

ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు



కర్ణాటక ఆర్టీసీ వైస్ చైర్మన్ మొహ్మద్ రిజ్వాన్ నవాబ్‌ను కలిసి పుస్తకాన్ని బహూకరిస్తున్న నాగరాజు

అనంతపురం కల్చరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలో అమలవుతున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేస్తోందని ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. త్వరలోనే ఇక్కడ కూడా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. కర్ణాటక రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డితోపాటు అక్కడి ఆర్టీసీ అధికారులను ఏపీ రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం శుక్రవారం కలిసి అధ్యయనం చేసింది. ఈ బృందంలో నాగరాజు కూడా ఉన్నాడు. రాష్ట్ర ప్రభుత్వంతో మరోసారి చర్చలు జరిపి ఉచిత బస్సు ప్రయాణంపై తుదినిర్ణయం తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

తాడిపత్రికి ఎయిర్‌పోర్టు

పరిశీలించాలని అధికారులకు సీఎం సూచన

అనంతపురం జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తాడిపత్రిలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు నిర్మాణానికి అవకాశం ఉందని, పరిశీలించాలని సీఎం చంద్రబాబు కేంద్ర విమానయాన శాఖమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎయిర్‌పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులకు సూచించారు. పెరుగుతున్న అవసరాల నేపథ్యంలో కొత్తగా ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటోంది. ఈక్రమంలోనే శుక్రవారం కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని తన నివాసంలో ఎయిర్‌పోర్టులపై సమీక్షించారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతంగా తాడిపత్రిని గుర్తించిన నేపథ్యంలోనే ముఖ్యమంత్రి తాడిపత్రిలో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేయాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

జాతీయ చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో ఈనెల 17 నుంచి నిర్వహించే జాతీయ చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల కర్నూలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులు సుకృత, రిషిక, మనస్వి మల్లిక, సాయి మనోజ్ కృష్ణలు జాతీయ పోటీలకు అర్హత సాధించారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా చెస్‌కోచ్ రవి అభినందించారు.



జాతీయ పోటీలకు ఎంపికైన జిల్లా చెస్ క్రీడాకారులతో కోచ్ రవి

ఎస్ఎస్‌బీఎన్ సేవలు ఆదర్శప్రాయం

80వ వసంతోత్సవాలలో వక్తలు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థలు భావితరాల విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తాయని పూర్వ, ప్రస్తుత ఉపాధ్యాయులు అన్నారు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఆవరణంలో విద్యాసంస్థల 80వ వసంతోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు. ముందుగా విద్యాసంస్థల ఫౌండర్ సిరివరం ఆదినారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు దేశ నలుమూలల ఉన్నత స్థానంలో స్థిరపడ్డారని వక్తలు అన్నారు. ఈ విద్యాసంస్థకు సిరివరం ఆదినారాయణ బీజం వేశారని, ఆయన సేవలు ఎనలేనివని అన్నారు. ఆయన నాటిన మొక్క మహావృక్షమై ఎంతో మంది పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తోందని అన్నారు. ఎంతో మంది ఉపాధ్యాయులకు ఉపాధిని కల్పిస్తోందని అన్నారు. వసంతోత్సవాలను నిర్వహించడం, పూర్వ విద్యార్థులు హాజరై విజయవంతం చేయడం చరిత్రలో నిలిచిపోతాయని అన్నారు. శని, ఆదివారాలలో నిర్వహించే జూనియర్ కాలేజీ, డిగ్రీ, పీజీ కళాశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పీఎల్ఎన్ రెడ్డి, కార్యదర్శి నిర్మలమ్మ, కోశాధికారి సుంకు వేణుగోపాల్, కమిటీ మెంబరు ఎస్ఆర్ నాగభూషణం, పూర్వ ఉపాధ్యాయులు సదానందం, శ్రీరాములు, సుధారాణి, ఆంజనేయులు, రోహిణికుమార్, సీతారామశాస్త్రి, శ్రీనివాసులు, హెచ్ఎం సుధామణి, ఉపాధ్యాయులు నాగరాజు, లక్ష్మినారాయణ, వేణుకోప్రారావ్, రమణారెడ్డి, పద్మావతి, పద్మలత, విద్యావతి, మౌనిక, జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ రామ్మోహన్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవ

- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపుతున్నాయని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కేంద్ర యువజన, క్రీడా శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎస్కే యూనివర్సిటీ క్రీడామైదానంలో జిల్లా స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వర్సిటీ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీలు క్రీడాపోటీలను ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, ఖో ఖో పోటీల్లో విజేతలకు ఎంపీ బహుమతులు అందజేశారు. ప్రతి ఒక్కరూ పాఠశాల స్థాయి నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సహకారంలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి భరత్, రెఫరీలు దాదావలీ, రాఘవేంద్ర, సింహాద్రి, రాజారెడ్డి, ప్రగతిపథం యూత్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

8న జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటన

అనంతపురం అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌లో జరిగిన పంట నష్టంపై అధ్యయం కోసం కేంద్ర కరువు బృందం ఈనెల 8న జిల్లాలో పర్యటించనుంది. జిల్లాలోని ఏఏ మండలాల్లో పర్యటిస్తారన్న షెడ్యూల్ ఖరారు చేయాల్సి ఉంది. షెడ్యూల్ ఖరారు చేసే పనిలో వ్యవసాయ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు.

మొక్కవోని ప్రయత్నం

వెయ్యి మొక్కలు నాటిన చిన్నారి నవని



నవనిని అభినందిస్తున్న రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్/ కల్చరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రెండో తరగతి చిన్నారి సుంకర నవని పర్యావరణహితం కోసం చేసే ప్రయత్నం అందరినీ ఆకట్టుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు ఏక్ పేడ్ మాకి నామ్ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంపై ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మీడియా ద్వారా చేసే సూచనలతో నగరానికి చెందిన చిన్నారి నవని స్ఫూర్తి పొంది, మొక్కలు నాటడం ప్రారంభించింది. తల్లిదండ్రులు రమేష్, కల్పన సహకారంతో ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ ప్రాంతాలలో ఇప్పటి వరకు సుమారు వెయ్యి మొక్కలు నాటింది. ఈనేపథ్యంలో రాష్ట్ర రాజధాని అమరావతిలో ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను చిన్నారి తన తల్లిదండ్రుల సహకారంతో శుక్రవారం కలిసింది. వారు చిన్నారి సేవాగుణాన్ని అభినంది, సర్టిఫికెట్ అందజేసి, ఆశీర్వదించారు.

టీచర్లకూ ఐదేళ్ల సర్వీసు నిబంధన తేవాలి

అనంతపురం విద్య, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో గరిష్ఠంగా ఐదేళ్ల సర్వీసు ఉండేలా మార్గదర్శకాలు రూపొందించాలని ఏపీ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్‌కు లేఖ రాసినట్లు పేర్కొన్నారు. ఒకే స్కూలులో 8 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులను, 5 ఏళ్ల సర్వీసు పూర్తయిన ప్రధానోపాధ్యాయులను తప్పనిసరి బదిలీలు చేస్తున్నారన్నారు. ఇతరశాఖల్లో ఒకే స్థానంలో 5 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని బదిలీ చేస్తున్నారన్నారు. టీచర్లను సైతం 5 ఏళ్ల గరిష్ఠ సర్వీసు నిబంధనను తీసుకుకావాలన్నారు.

ట్రేడ్ మార్క్..!

- అవినీతిలో కొత్తదారులు
- ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లింపులో టోకరా
- సొంతజేబులు నింపుకున్న కొందరు అధికారులు
- ఏళ్ల తరబడి చెల్లించని మొండి యజమానులు
- నగరపాలికకు రూ.కోట్లలో పేరుకుపోయిన బకాయిలు



త్రిబుల్ ఎస్ బార్ అండ్ రెస్టారెంట్

అనంతపురం క్రైం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నగరపాలిక ట్రేడ్ లైసెన్స్‌లో మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. దీంతో నగరపాలిక ఆదాయానికి గండి పడుతోంది. నగరంలో కొన్ని దుకాణాలు, పెద్ద వ్యాపారాలు నిర్వహించే షాపులకు కనీసం ట్రేడ్ లైసెన్స్ ఫీజు కూడా లెక్కించలేదు. దీంతో వారు దర్జాగా వ్యాపారం చేసుకుంటూ కార్పొరేషన్ ఆదాయానికి గండికొడుతున్నారు. నగరపాలికలో ట్రేడ్‌లైసెన్స్ వ్యవహారాలను పబ్లిక్ హెల్త్ విభాగం పర్యవేక్షిస్తుంది. ఇందులో పని చేసే కొందరు అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల గతం నుంచి కూడా చేతివాటం చూపుతున్నారనే ఆరోపణలున్నాయి. తాజాగా విజిలెన్స్ అధికారులు నగరంలోని ట్రేడ్ లైసెన్స్‌ల విషయంలో బకాయిల లెక్కల చిట్టా నగరపాలిక అధికారులకు ఇచ్చారు. ఇక కొన్ని దుకాణాలు ఓ ఫర్మ్ పేరుతో ఏర్పాటు చేసి వ్యాపారాలు జరగక, మరి కొన్ని కారణాలతోనూ వాటిని తొలగించారు. అలాంటి సంఖ్య బాగానే ఉన్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇలా బకాయిలు నగరపాలికలో పేరుకుపోయాయి.



నవీద్ రెసిడెన్సీ

నగరపాలికకు రూ.4కోట్ల బకాయిలు

అనంతపురం నగర పరిధిలో 50 డివిజన్లున్నాయి. నగర పరిధిలో ఎలాంటి వ్యాపారం నిర్వహించేవారైనా దుకాణం తీసుకుంటే అందుకు సంబంధించి నగరపాలికకు ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆ మొత్తం ఏడాదికో సారి వసూలు చేస్తారు. ఇందులో మొత్తం 10,060 వరకు అసెస్మెంట్లున్నాయి. వాటి నుంచి ట్రేడ్ లైసెన్సులకు సంబంధించి కార్పొరేషన్ కార్యాలయంలో నమోదు చేశారు. ఇందులో కనీసం చిన్న సైజు గదులున్న కిరాణా దుకాణాల నుంచి హోటళ్లు, ఆసుపత్రులు, బార్లు, రెస్టారెంట్లు ఉంటా యి. చిన్న దుకాణాలైతే కనీసం రూ.1000ల నుంచి పెద్ద వ్యాపార సముదాయమైతే రూ.20వేల వరకు ఉంటాయి. ప్రతి ఏటా రెన్యువల్ చేసుకుంటూ ఆ మొత్తం చెల్లిస్తారు. కనీసం ఒక్కో దుకాణం నుంచి రూ.2వేల ప్రకారం లెక్క వేసుకున్నా ప్రతి ఏటా రూ.2కోట్లు కార్పొరేషన్ ఖజానాలోకి చేరాలి. కానీ ఇప్పటివరకు రూ.4కోట్ల వరకు బకాయిలున్నట్లు అధికారులు నిర్ధారించారు.

జేబులు నింపుకున్న ఘనులు

నగరంలో ట్రేడ్ లైసెన్స్ వసూలు, చెల్లింపు అంతా పారిశుధ్య విభాగం అధికారులే పర్యవేక్షిస్తుంటారు. 2015 వరకు అంతా ఆఫ్‌లైన్‌లోనే ఉండటంతో డబ్బు తీసుకుని కేవలం రసీదులిచ్చేవారు. ఇందులో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు బాగా చేతివాటం చూపేవారు. దుకాణదారులతో ఒప్పందం చేసుకుని ఎంతో కొంత పుచ్చుకునేవారు. ఆ మొత్తం కార్పొరేషన్‌కు చెల్లించకుండా జేబులో వేసుకునే వారు. రూ.5వేలకుపైగా నే చెల్లించాల్సి ఉన్న వ్యాపార సముదాయా ల నుంచి సగం మాత్ర మే వసూలు చేసేవా రు. 2016 లో ట్రేడ్‌లైసెన్స్‌లన్నీ ఆన్‌లైన్ చేశారు. అ ప్పటి నుంచి కూడా కొందరు గోల్‌మాల్ చేశారనే ఆరోపణలున్నా యి. సచివాలయ వ్యవస్థ ఏర్పాటయ్యాక శానిటరీ సెక్రెటరీలకు అ ప్పగించడంతో ఆ వ్యవహారం చా లావరకు తగ్గినట్లు తెలిసింది. నగరంలో ఏదో ఒక పేరుతో షాపులు తె రిచి ట్రేడ్ లైసెన్స్ చెల్లించని దుకాణాలు నగరంలో 1500 నుంచి 2వేల వరకు ఉన్న ట్లు తెలిసింది. బిజినెస్ ఎక్కువగా జరిగే కమలానగర్‌లోనే 300వరకు ఉన్నట్లు సమాచారం. వీటి నుంచి రూ.80లక్షల ఫీజు రావాల్సి ఉన్నట్లుగా నిర్ధారించినట్లు తెలిసింది.

లైసెన్సే తీసుకోం..

ఏటా రూ.లక్షల నుంచి రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్నా కొందరు ట్రేడ్ లైసెన్స్ కూడా తీసుకోరు. శ్రీకంఠం సర్కిల్‌లో నవీద్ రెసిడెన్సీ పేరుతో ఓ లాడ్జి నిర్వహిస్తున్నారు. కొంత కాలం కిందటి వరకు అదే రెసిడెన్సీలోనే హోటల్ కూడా నిర్వహించారు. 15ఏళ్ల నుంచే ఇక్కడ వ్యా పారం జరుగుతోంది. కానీ ఇంతవరకు ట్రేడ్ లైసెన్స్ తీసుకోలేదట. సిబ్బంది వెళితే...రాజకీయనాయకుల పేర్లు చెప్పుకుంటూ చెలామణి అవుతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి వ్యాపార సముదాయాలు నగరంలో 100కు పైగా ఉన్నట్లు సమాచారం. టవర్‌క్లాక్ సమీపంలోని పోలీస్‌కాంప్లెక్స్‌లో దాదాపు 175వరకు దుకాణాలున్నాయి. వీటిలో 10శాతం మాత్రమే అప్పుడప్పుడు ట్రేడ్ లైసెన్స్ చెల్లిస్తున్నట్లు తెలిసింది. ప్రాపర్టీ టాక్స్ ఏమాత్రం చెల్లించని ఈ దుకాణాల నుంచి రెండేళ్ల నుంచి ట్రేడ్‌లైసెన్స్ వసూలు కానట్లు తెలుస్తోంది. ఆర్టీసీ బస్టాండ్ నుంచి గుత్తిరోడ్డుకు వెళ్లే దారిలోని త్రిబుల్ ఎస్ బార్ అండ్ రెస్టారెంట్ పేరుతో ఏకంగా నాలుగు ట్రేడ్ లైసెన్సులున్నాయట. 2016లో రెండు, అనంతరం మరో రెండు పేర్లతో రిజిస్టర్ చేయించారు. ఇలా మార్చడానికి ముందు తీసుకున్న పేర్ల తో ఎక్కువ మొత్తం చెల్లించా ల్సి రావడం, మరో పేరుతో తగ్గించుకోవడానికే ఇలా చేస్తారని కార్పొరేషన్ వర్గాలంటున్నాయి. అప్పట్లో పనిచేసిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీల సహకారంతోనే ఇలా చేసినట్లు సమాచారం. ఈ బార్ నుంచి రూ.1లక్షకు పైగా బకాయి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కమలానగర్‌లోనే ఓ వస్త్ర వ్యాపారం చేసే నిర్వాహకుడు ట్రేడ్ లైసెన్స్ చెల్లించమంటే ఎవరెవరి పేర్లో చెబుతాడట. 2019 నుంచి 24 వరకు ప్రతి ఏట 50 నుంచి 60శాతం మాత్రమే వసూలవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.



పోలీస్ షాపింగ్ కాంప్లెక్స్

బకాయిలలో కొన్ని...

నగరంలో కొన్ని వేల నుంచి రూ.లక్షల్లో బకాయిలున్నాయి. గ్రీన్ బావర్చీ రెస్టారెంట్‌కు రూ.1.50లక్షలు, అనంతపురం క్లబ్‌కు రూ.1.50లక్షలు, త్రిబుల్ ఎస్ బార్‌కు రూ.1.20లక్షలు, గణేష్ రెస్టారెంట్‌కు రూ.80వేలు, పవర్‌రెస్టారెంట్ హోటల్, గోల్డెన్ తాజ్ హోటల్, విద్యానికేతన్ స్కూల్, పారడైజ్ బార్ రెస్టారెంట్, తిప్పయ్య మోటార్స్, ఎంపైర్ ఫ్యామిలీ రెస్టారెంట్, సాయి డయాగ్నస్టిక్ అండ్ ఫెటల్ మెడిసిన్, రేణుక వైన్స్, విజయ వైన్స్, చరిత వైన్స్, జేకేఆర్ వైన్స్, ఎల్ఎన్ వైన్స్, సాయి తేజ వైన్స్, ఎస్ఎస్ వైన్స్, అనురాధ వైన్స్, క్రాంతి హాస్పిటల్, జేబీ రెస్టారెంట్, జేబీ హాస్పిటల్‌లకు సంబంధించి ఒక్కో దానికి రూ.42వేల నుంచి రూ.60వేల వరకు బకాయిలున్నాయి. వీటిలో కొన్ని వ్యాపార సంస్థలు మార్చేయడం గమనార్హం.

నడవలేనిస్థితిలో కృష్ణజింక



జంతు సంరక్షణశాలలో జింకను అప్పగిస్తున్న అధికారులు

గోరంట్ల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగానిపల్లి సమీపంలోని రైతు విష్ణు పొలంలో శుక్రవారం కృష్ణజింక నడవలేని స్థితిలో కనిపించింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు రాహుల్, రామక్రిష్ణ అక్కడికి చేరుకుని కృష్ణజింకను పరిశీలించారు. శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో లేచి వెళుతుందేమోనని చాలా సేపు వేచి చూశారు. పక్షపాతం వల్ల అనారోగ్యానికి గురైందని బుక్కపట్నం అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ యామినీ సరస్వతికి పరిస్థితి వివరించారు. ఆమె ఆదేశాల మేరకు పుట్టపర్తిలోని జంతు సంరక్షణ శాలకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు.

డీజిల్‌షెడ్ ఉద్యోగులకు జీఎం అవార్డులు

గుత్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): గుత్తి రైల్వే డీజిల్ షెడ్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉద్యోగులు శుక్రవారం సికింద్రాబాద్‌లో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. స్థానిక డీజిల్ షెడ్‌లో పనిచేస్తున్న ఆఫీస్ సూపరింటెండెంట్ మల్లికార్జున, ఎలక్ట్రికల్ లోకో సీనియర్ సెక్షన్ ఇంజనీర్ మనోజ్‌కుమార్ అవార్డు అందుకున్నారు. స్థానిక సీనియర్ డీఎంఈ ప్రమోద్, అధికారులు, సూపర్‌వైజర్లు, కార్మికసంఘం ప్రతినిధులు అవార్డు గ్రహీతలను అభినందించారు.





అవార్డులు అందుకుంటున్న మనోజ్ కుమార్, మల్లికార్జున

నిరుద్యోగుల చెంతకే కంపెనీలు

ధర్మవరంలో 9న మెగా జాబ్‌మేళా

పోస్టర్లు ఆవిష్కరించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగం కల్పించే లక్ష్యంతో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సంస్కృతి సేవాసంస్థ సౌజన్యంతో ఈనెల 9న ధర్మవరంలోని సీఎన్‌బీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాకు సంబంధించి శుక్రవారం విజయవాడలో ఆయన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వివిధ కోర్సులు పూర్తి చేసుకున్న యువతీ యువకులు ఉద్యోగాల కోసం వివిధ కంపెనీల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో దేశంలోని 90 ప్రముఖ కంపెనీలను నిరుద్యోగుల చెంతకే తీసుకువచ్చి మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బి.పార్మసీ, ఎం.పార్మసీ, నర్సింగ్, ఏదైనా డిగ్రీ, పీజీ చదివి 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయసు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.10వేల నుంచి రూ.50వేల వరకు జీతం ఉంటుందన్నారు. విద్యార్హత జిరాక్స్ పత్రాలు, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలతో రావాలని మంత్రి తెలిపారు. మరిన్ని వివరాలకు .. 9182288465, 9490442576, 9390176421 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

టమోటా కిలో రూ.10

అనంతపురం రూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.10తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.8, కనిష్ఠ ధర రూ.5 పలికినట్లు ఆయన తెలిపారు.



న్యూస్ బాక్స్

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



పల్లవి



సత్యప్రకాష్



ద్వారకానాథ్ రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈనెల 6వతేదీ గుజరాత్‌లోని భావానగర్‌లో జరిగే జాతీయ మహిళ, పురుషుల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన పల్లవి, సత్యప్రకాష్, ద్వారకానాథ్‌రెడ్డి రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. క్రీడాకారులను బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నరేంద్రచౌదరి, డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ అభినందించారు.

వరి, వేరుశనగ సస్యరక్షణపై శిక్షణ



మాట్లాడుతున్న ఏరువాక కోఆర్డినేటర్ రామసుబ్బయ్య

పుట్టపర్తిరూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): వరి, వేరుశనగ పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ రామసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కొట్లపల్లిలో వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో వరి, వేరుశనగ పంటలకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామసుబ్బయ్య మాట్లాడుతూ మండలంలో వరిపంట ప్రస్తుతం పిలకదశలో ఉందన్నారు. వరిలో కాలిబాటలు తీయాలన్నారు. దీనివల్ల గాలి, వెలుతురు బాగా ఆడి పంట ఆరోగ్యంగా ఉంటుందన్నారు. క్రిమిసంహారక మందులు వేయడానికి అనువుగా ఉంటుందన్నారు. వేరుశనగ ప్రస్తుతం ఊడలు దిగే దశకు చేరుకుందన్నారు. రసం పీల్చే పురుగుల నివారణకు ఈమిడాక్లోప్రిడ్ 0.4 మిల్లీమీటర్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. శనగపంట ప్రస్తుతం కాయ అభివృద్ధి దశలో ఉందని, దీనికి ఎండతెగులు ఆశించకుండా ఎక్సాకొనజోల్ పిచికారి చేయాలన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

తాడిపత్రి, జనవరి3(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని చల్లవారిపల్లి రైల్వేస్టేషన్ వద్ద రైలులో నుంచి జారిపడి మోహన్‌నాయక్ (31) మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపారు. పట్టణంలోని విజయనగర్‌కాలనీకి చెందిన జయరాంనాయక్, లీలాబాయ్ దంపతుల కుమారుడు మోహన్‌నాయక్ టీస్టాల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తల్లి లీలాబాయ్‌కు కంటి ఆపరేషన్ కోసం కడపకు వెళ్లి తిరిగి రైలులో వస్తుండగా తాడిపత్రి రైల్వేస్టేషన్‌లో రైలు ఆగకపోవడంతో గుత్తిలో దిగారు. అక్కడి నుంచి తాడిపత్రికి వెళ్లడానికి మరో రైలు ఎక్కారు. లీలావతిబాయ్ మహిళల కోచ్‌లో ఎక్కగా, మోహన్‌నాయక్ మరో కోచ్‌లో ఎక్కాడు. లీలావతిబాయ్ తాడిపత్రిరాగానే రైలు నుంచి దిగింది. మోహన్‌నాయక్ పొరపాటున స్టేషన్‌లో దిగలేదు. చల్లవారిపల్లి స్టేషన్ రాగానే తాడిపత్రిస్టేషన్ వెళ్లిపోయిందని గమనించి నెమ్మదిగా వెళుతున్న రైలు నుంచి దిగేందుకు ప్రయత్నించాడు. కానీ జారిపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని రైల్వే సిబ్బంది గమనించి, తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దున్నపోతు కోసం రెండు గ్రామాల వార్

కూడేరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఓ దున్నపోతు కోసం రెండు గ్రామాల మధ్య వివాదం నెలకొంది. కూడేరు మండలం ముద్దలాపురం, కడదరకుంట గ్రామాల మధ్య దున్నపోతు వివాదం చిలికి చిలికి గాలివానగా మారింది. శుక్రవారం ముద్దలాపురం గ్రామస్థులు కలెక్టర్‌ను కలిసి తమ దున్నపోతు కడదరకుంట గ్రామస్థుల బందీలో ఉందని, విడిపించాలని వినతి పత్రం అందజేశారు. ఈ నెల 21న కడదరకుంట, 22న ముద్దలాపురం గ్రామాల్లో దేవర జరుగనుంది. గ్రామ దేవతలకు బలిచ్చే దున్నపోతు వివాదం ఆ రెండు గ్రామాల మధ్య చిచ్చురేపింది. దున్నపోతు తమదంటే, తమదని ఇరు గ్రామస్థులు వాదనకు దిగుతున్నారు.

799 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 799 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కు 450 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.29వేలు

అనంతపురంరూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.29,190, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.18,600లతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 22 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

విజయమే లక్ష్యం

రాష్ట్రస్థాయిలోనూ అవార్డులు సాధించాలి

కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు అభినందన

ముగిసిన జిల్లాస్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శన



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

రాప్తాడు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విజయమే లక్ష్యంగా కష్టపడాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన-2025 నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటూ అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎమ్మెల్సీ మంగమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు విజయం వెంట పరుగులు తీయాలన్నారు. కృషి, పట్టుదల, దీక్ష, క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. విద్యార్థి దశలో అపజయం ఎదురైతే నిరాశ పడకుండా మరింత ఉత్సాహంతో ముందుకెళ్లాలని సూచించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలు బాగున్నాయన్నారు. జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో కూడా బహుమతులు గెలుచుకోవాలన్నారు. విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనపై తమ అనుభవాలు వివరించిన విద్యార్థులు గంగోత్రి, వాణి, వేణుభాస్కర్‌లను కలెక్టర్ అభినందించారు. ఎంపీ అంబికా మాట్లాడుతూ విద్యార్థులు పోటీ ప్రపంచంలో భిన్నంగా ఆలోచించడంతో పాటు కృషి, పట్టుదలతో చదువుకున్నప్పుడే ముందుకు వెళతారన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత కోరిక మేరకు ఆదర్శ పాఠశాలలో అవసరమైన పనులు చేపట్టేందుకు రూ. 5 లక్షల ఎంపీ నిధులు మంజూరు చేస్తామన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఆరుగురు విజేతలుగా నిలవడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం చాలా మంది విద్యార్థులకు తింటున్న ఆహారం ఎలా వస్తుందో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. అందుకే ఉపాధ్యాయులు వ్యవసాయం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో గెలుపొందినవారికి పరిటాల రవీంద్ర ట్రస్ట్ ద్వారా రూ. లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఎమ్మెల్సీ గంగమ్మ మాట్లాడుతూ విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు ఎంతో బాగున్నాయన్నారు. ప్రభుత్వం అందించే అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ ప్రసాద్‌బాబు, రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ విజయకుమారి, ఎంఈఓ మల్లికార్జున, ప్రిన్సిపల్ పద్మజాదేవి, జిల్లా వైజ్ఞానిక అధికారి బాలమురళి, జ్యూరీ మెంబర్లు పీఎల్ఎన్ ప్రసాద్, రఘురాం, డిప్యూటి డిఈఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, డీఈఓ

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు 9 ప్రాజెక్టులు

అనంతపురం విద్య, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ నుంచి రాష్ట్ర స్థాయికి 9 ప్రాజెక్టులను ఎంపిక చేసినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, జిల్లా సైన్స్ ఆఫీసర్ బాలమురళీ కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యక్తిగత విభాగంలో రాప్తాడు జడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి ఆర్ఎస్ రెడ్డి ప్రాజెక్టు, గుంతకల్లు మండలం కసాపురం జడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి వంశీ ప్రాజెక్టు, డి. హీరేహాళ్ మండలం హోసగుడ్డం ఎంపీయూపీ స్కూల్ నవిక ప్రాజెక్టులను ఎంపిక చేశామని తెలిపారు. గ్రూప్స్ విభాగం నుంచి కణేకల్లు మండలం హనకనహాళ్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు గీతారెడ్డి, మహాలక్ష్మి ప్రాజెక్టు, పుట్లూరు మండలం శనగలగూడూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు హరిణి, చర్విత ప్రాజెక్టు, తాడిపత్రి మోడల్ స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులు యజ్ఞశ్రీ, మధురిమ ప్రాజెక్టులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. టీచర్స్ విభాగం నుంచి ఉరవకొండ మండలం ఆమిద్యాల జడ్పీ హైస్కూల్ టీచర్ శ్రీనివాస్ ప్రాజెక్టు, పెద్దపప్పూరు మండలం పెద్దయక్కలూరు జడ్పీ హైస్కూల్ టీచర్ కృష్ణమోహన్‌రెడ్డి ప్రాజెక్టు, కూడేరు మండలం కరుట్లపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన మహమ్మద్ రఫీ ప్రాజెక్టులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.



పాముల నుంచి రైతులను కాపాడే స్టిక్

మూడు అడుగుల ప్లాస్టిక్ పైపునకు కింద భాగాన ఒక ప్లాస్టిక్ గరాటు అతికించా. అందులో ఒక వైబ్రేటర్‌ను రెండు వైర్ల సాయంతో ప్లాస్టిక్ స్టిక్ పైన బ్యాటరీకి కలిపా. స్టిక్ మధ్యలో ఒక డూమ్‌లైట్ అమర్చా. శబ్దం వచ్చేందుకు ఒక బజ్‌ను అమర్చా. వీటన్నింటిని స్టిక్ హ్యాండిల్ వద్ద కలిపి స్విచ్ అమర్చా. స్విచ్ ఆన్ చేస్తే వైబ్రేటర్ కదిలి శబ్దం వస్తుంది. స్టిక్ పట్టుకుని లైట్ ఆన్ చేసుకుని రైతులు పొలాల్లో నడిచేటప్పుడు ఆ శబ్దానికి పాములు, ఇతర విషపురుగులు దగ్గరకు రావు. ఈ స్టిక్ ద్వారా రైతులు పాముల నుంచి ఎదురయ్యే ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చు.

\- శంకర్‌నాథ్‌రెడ్డి విద్యార్థి రాప్తాడు ఉన్నత పాఠశాల (రాష్ట్ర స్థాయికి ఎంపిక)

పర్యావరణ హిత ఇంధన గుళికలు

కసాపురం చుట్టు పక్కల కొండల్లో తేనె పట్టు ఎక్కువగా దొరుకుతుంది. పట్టు నుంచి తేనె తీసిన తరువాత మైనం పడేస్తారు. అలాకాకుండా ఆ మైనాన్ని తెచ్చి వేడి నీళ్లలో కరిగించాలి. తర్వాత చిన్న చిన్న స్టీలు కప్పుల్లో రంపపుపొట్టు తీసుకుని దానిలోకి మైనం కలపాలి. 15 నిమిషాల తరువాత మైనం గడ్డ కడుతుంది. గడ్డ కట్టిన మైనం ఇంధన గుళికలుగా మారుతుంది. 10 గ్రాములు ఇంధన గుళికలు 15 నిమిషాలు వెలుగుతాయి. 10 గ్రాములు ఇంధన గుళికలు తయారీకి రూపాయి ఖర్చు అవుతుంది. 4 గుళికలు ఉంటే అరకిలో బియ్యం వండుకోవచ్చు. బయట ప్రదేశాల వెళ్లినప్పుడు అన్నం, ఇతర ఆహార పదార్థాలు వండుకునేందుకు ఈ పర్యావరణ హిత గుళికలు చాలా ఉపయోగకరం.

\- వంశీ, విద్యార్థి కసాపురం ఉన్నత పాఠశాల (రాష్ట్ర స్థాయికి ఎంపిక)



జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



విద్యార్థిని అనిత

ఉరవకొండ,జనవరి 3(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం గడే చిన్నహోతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న అనిత అనే విద్యార్థిని జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీడీ ప్రభాకర్ తెలిపారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈ నెల 10 నుంచి 15 తేదీ వరకూ జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందని హెచ్ఎం ఎంటీఎల్ ప్రసాద్ తెలిపారు. విద్యార్థిని ఎంపిక పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అటవీ స్థలాల రక్షణపై శ్రద్ధ

● డీఎఫ్ఓ విఘ్నేష్

అనంతపురం న్యూటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అటవీస్థలాల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందిని డీఎఫ్ఓ విఘ్నేష్ ఆదేశించారు. గుత్తి రేంజర్ కార్యాలయంలో రేంజర్ మధుబాబుతో కలిసి శుక్రవారం ఆయన సిబ్బందికి అటవీ స్థలాల రక్షణ, మొక్కల సంరక్షపై చేపట్టాల్సిన చర్యలు, వన్యప్రాణుల సంరక్షణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది చేపట్టాల్సిన అంశాలకు సంబంధించి డీఎఫ్ఓ పలు సూచనలు చేశారు. అనంతరం శాఖ పరమైన అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత నెలలో సిబ్బందికి రెండు సార్లు శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. ఈక్రమంలోనే శుక్రవారం గుత్తి రేంజ్ పరిధిలోని సిబ్బందికి శిక్షణ ఏర్పాటు చేసినట్లు డీఎఫ్ఓ తెలిపారు. శిక్షణలో ప్రధానంగా అటవీ స్థలాలు, ఆస్తుల రక్షణపై సిబ్బందికి తగిన శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈనేపథ్యంలోనే జక్కల చెరువు బీట్‌కు వెళ్లి, అక్కడ 10 హెక్టార్లలో నాటిన మొక్కలను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో సెక్షన్ ఆఫీసర్లు నారపరెడ్డి, జగన్నాథం, కరీముల్లా, బీట్ ఆఫీసర్లు రమేష్‌బాబు, సుధాకర్, మాధవి, రాజేశ్వరి, వెంకటరమణ, చంద్రశేఖర్, సతీష్‌కుమార్, మంజులవాణి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు యువతి అదృశ్యం



కోమలత(ఫైల్)

అనంతపురం క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా పత్తికొండ పట్టణానికి చెందిన కోమలత అనంతపురం నగరంలో అదృశ్యమైందని టూటౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపారు. కోమలత అనంతపురం నగర శివారులోని ఓ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. సాయినగర్‌లోని ప్రైవేటు ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటోంది. గత నెల 28వ తేదీ ఉదయం హాస్టల్ నుంచి అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జగన్ అవినీతిపై ఉపేక్ష తగదు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు జగదీశ్

గుంతకల్లు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో మాజీ సీఎం జగన్ అవినీతిపై కేసులు పెట్టి విచారించేందుకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి. జగదీశ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏడు వేల మెగా వాట్ల విద్యుత్ కొనుగోలు విషయంలో ఆదానీ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాల్లో భారీ అవినీతి జరిగిందని అమెరికా దర్యాప్తు సంస్థలు స్పష్టంచేసి కేసులు నమోదు చేశాయని తెలిపారు. అందులో జగన్‌కు రూ.1,750 కోట్ల ముడుపులు ముట్టినట్టు ఆరోపణలు వచ్చినా కూటమి ప్రభుత్వం ఉపేక్షించడం తగదని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు వీరభద్రస్వామి, గోపి, మహేశ్, మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

పంచాయతీ నిధులు పక్కదారి


పని గోరంత...బిల్లులు కొండంత

ఏడాదిలో కోటికి పైగా నిధులు డ్రా

అధికారులు, నాయకుల కుమ్మక్కు

విచారణలో అక్రమాలు వెలికి తీసేరా..?

హిందూపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): చిలమత్తూరు మండలంలో పంచాయతీ నిధులు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. మండలంలో కొంత కాలంగా పనిచేస్తున్న ఓ కార్యదర్శి చేతివాటం ప్రదర్శించి నిధులు భారీ ఎత్తున డ్రా చేసినట్లు తెలుస్తోంది. అధికారి బంధువులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధుల పేరుమీద నిధులను డ్రా చేసినట్లు ఇటీవల మేరీ పంచాయతీ వెబ్‌సైట్ యాప్ ద్వారా వెలుగు చూసినట్లు సమాచారం. ఇప్పటికే దీనిపై ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఆ కార్యదర్శి పీఎఫ్ఎంఎస్ ద్వారా కొన్నింటికి ఎం.బుక్కులు లేకుండా నిధులు డ్రా చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ కార్యదర్శి ఎక్కడ పనిచేసినా నాయకులను సమన్వయ పరుచుకోవడంలో దిట్టగా పేరుగాంచారు. గత వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులతో కలిసి పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కొంత మంది అధికార పార్టీ నాయకులు ఏరికోరి అతడికి పంచాయతీలను అప్పగించారు. అతడు పనిచేసిన పంచాయతీల్లో గోరంత పనులు ఉన్నా కొండంత నిధులు డ్రా చేసినట్లు విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా వాటర్ వర్క్సకి సంబంధించిన బిల్లులు ఎక్కువ ఉన్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కొంత మంది నాయకులతో కలిసి పాత వాటికే బిల్లులు మంజూరు చేసినట్లు సమాచారం. ఆయన 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు తాను పనిచేసిన పంచాయతీల్లో రూ. 1.3 కోట్లు నిధులను డ్రా చేసినట్లు అధికారులు అంచనా వేశారు. ఇందులో అధిక శాతం వాటర్ వర్క్స్‌కే కేటాయించినట్లు తెలుస్తోంది. ఒకే కార్యదర్శికి మూడు పంచాయతీల బాధ్యతలను అప్పగించారు. ఇందులో మేజర్ పంచాయతీ ఉంది. ఈ పంచాయతీకి నిధులు పుష్కలంగా ఉన్నాయి. ఇదే అదనుగా భావించి కార్యదర్శితో పాటు స్థానిక ప్రజాప్రతినిధి, అధికార పార్టీకి చెందిన నాయకులు ఆ నిధులపై కన్నేశారు. దీంతో సెప్టెంబరు నుంచి నిధులు డ్రా చేయడం ప్రారంభించారు. సెప్టెంబరు 5న సచివాలయం అద్దె కోసం రూ. 1.38 లక్షలు, అదే రోజు నీటి నిర్వహణ కోసం రూ. 50 వేలు, సెప్టెంబరు 19న నీటి నిర్వహణ కోసం రూ. 6.61 లక్షలు, 23న రూ. 4.57 లక్షలు, అదే రోజున నీటి నిర్వహణ కోసం రూ. 2 లక్షలు, 24న నీటి నిర్వహణ కోసం రూ. 3.85 లక్షలు డ్రా చేసినట్లు తెలుస్తోంది. ఒకే పంచాయతీలో కూటమి ప్రభుత్వం వచ్చాక అరకోటికి పైగా నిధులు డ్రా చేసినట్లు సమాచారం. కార్యదర్శితో కొంత మంది అధికార పార్టీకి చెందిన నాయకులు కుమ్మక్కై పంచాయతీ నిధులు పక్కదారి పట్టించినట్లు, కొన్ని పనులు చేయకుండానే నిధులు డ్రా చేసినట్లు సమాచారం. అధికార పార్టీలోని ఓ వర్గం నాయకులు మేరీ పంచాయతీ వెబ్‌సైట్ ద్వారా డ్రా చేసిన బిల్లులను ఆన్‌లైన్ ద్వారా చూసి వాటికి సంబంధించి స్క్రీన్ షాట్‌లను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఇందులో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు లక్షల్లో బిల్లులు డ్రా చేసినట్లు, స్థానిక ప్రజాప్రతినిధికి చెందిన బంధువులు, వైసీపీకి చెందిన కార్యకర్తల పేరుమీద కూడా నిధులు డ్రా చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి చేరింది. దీంతో మూడు రోజుల క్రితం ఎమ్మెల్యే దీనిపై విచారణ చేయాలని జిల్లా అధికారికి సూచించినట్లు సమాచారం. ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేయడంతో మేజర్ పంచాయతీ విధుల నుంచి కార్యదర్శిని తప్పించారు. ఎమ్మెల్యే దీనిపై సీరియస్‌గా పరిగణించడంతో ఉన్నతాధికారులు విచారణ ఏ రీతిలో చేస్తారనేది వేచి చూడాలి.



సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నిధులు డ్రా చేసిన బిల్లులు ఇవే..

న్యూస్ బాక్స్ ...



బ్యాంకు ముందు నిరీక్షిస్తున్న మహిళలు

బ్యాంకు వద్ద నగదు కోసం నిరీక్షణ

బత్తలపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): బ్యాంకు సకాలంలో నగదు రాకపోవడంతో మహిళా సంఘాల సభ్యులు శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వద్ద నిరీక్షించారు. తాడిమర్రి మండలం ఆత్మకూరు, మర్రిమేకలపల్లి, అగ్రహారం గ్రామాలకు చెందిన మహిళ సంఘలకు కొత్త రుణాలు మంజురయ్యాయి. వీరందరు శుక్రవారం బత్తలపల్లిలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వద్ద ఉదయం పది గంటలకు వచ్చారు. హెడ్ ఆఫీస్ నుంచి నగదు సకాలంలో రాకపోవడం సాయంకాలం 5గంటలు వరకు అక్కడే నిరీక్షించారు. సాయంత్రం 5.30 గంటలకు డబ్బులు రావడంతో వారికి ఆ నగదు అందజేశారు. దీనిపై బ్యాక్ మేనజర్ రి జ్వానను వివరణ కోరగా.. హెడ్ ఆఫీస్ నుంచి నగదు ఆలస్యంగా వచ్చిందని, దీంతో పంపిణీ ఆలస్యమైందని తెలిపారు.

రోబోటిక్ సెంటర్ ప్రారంభం

నంబులపూలకుంట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గీర్వాణీ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రోబోటిక్ టెక్నాలజీ సెంటర్‌ను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం ప్రారం భించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టెక్నాలజీని మంచికే వాడాలి తప్పా.. చెడుకు వినియోగించరాదన్నారు. ఆ పాఠశాల పూర్వ విద్యార్థి, యూనివర్సిల్ హెల్ప్ ఫౌండేషన్ ఫౌండర్ రేబ్బా ధృవ విద్యార్థులకు రోబోటిక్ టెక్నాలజీని వివరించారు. ఈ కార్యక్ర మంలో తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఎంపీడీఓ ఆంజనప్ప, ఎంఈఓ సుబ్బిరెడ్డి, హెచ్ఎం శీరీషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన



తాము తయారు చేసిన నమూనాలతో విద్యార్థులు

నల్లమాడ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతబాలాజీ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ప్రదర్శన ఆకట్టుకుంది. ఇందులో ఎల్‌కేజీ నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరిక రాల ప్రదర్శించారు. ప్రతిభ కనబరచిన వారికి బహుమ తులు అందజేశారు. కరస్పాండెంట్ పోలే వెంకటరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడం కోసమే ఇలాంటి విజ్ఞాన ప్రదర్శనలు ఎంతగానో ఉపయోపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు వేమనారాయణ, సురేష్‌బాబు, హెచ్ఎం స్వర్ణలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

పుట్టపర్తి రూరల్ : పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని జిల్లా సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండు చేశారు. శుక్రవారం గణేష్ కూడలిలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెం ట్లు చొప్పున ఇళ్ళస్థలాలను మంజూరు చేయాలన్నారు. ఈ మేరకు శనివారం నుంచి ఈ నెల పదో తేదీ వరకు తహ సీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల మందు నిరసన కార్యక్రమా లను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి అంజనేయులు, నల్లమాడ కార్యదర్శి వెంకటరమణ, వ్యవ సాయసంఘం జిల్లా అధ్యక్ష ఉపాధ్యక్షులు కుళ్ళాయప్ప పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ధర్మవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ మాట్లాడుతూ.. జీఓ నెంబర్ 36 ప్రకారం జీతాలు చెల్లించాలన్నారు. గత ఏడాది 16 రోజుల సమ్మె కాలంలో ఒప్పంద జీఓ కాపీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ సెక్షన్‌లో 25 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వారిని ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. అనంతరం కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కో-కన్వీనర్‌లు అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, ఇంజనీరింగ్ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో తెలుగురైతు మృతి



చంద్రమోహన్ (ఫైల్)

కొత్తచెరువు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గాజుల చంద్రమోహన్(55) అనారోగ్యంతో శుక్ర వారం ఉదయం మరణించాడు. ఈయన పుట్టపర్తి నియోజకవర్గ తెలుగు రైతు సంఘం అధ్యక్షుడు. ఆయన మృతదే హానికి ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పలువురు నివాళులర్పించారు. చంద్రమోహన్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కదిరి అర్బన్ : మండలంలోని టోల్‌గేట్ సమీపంలో శుక్రవారం రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు రైల్వే ఎస్ఐ రహీమాన్ తెలిపారు. ధర్మవరం నుంచి నరసాపురానికి మధ్యాహ్నం ఎక్స్‌ప్రెస్ రైలు వెళ్తుండగా.. గుర్తు తెలియని వ్యక్తి దాని కింద దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా ఉందని, ఎలాంటి ఆధారాలూ లభించలేదని వారు తెలిపారు.

ఇసుక టిప్పర్లు స్వాధీనం

బత్తలపల్లి : మండలంలోని గరిశన పల్లి వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను శుక్రవారం సీజ్ చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించామని, కేసు దర్యాప్తు చేపట్టామని చెప్పారు.

రోడ్డుపక్కనే చెత్తాచెదారం

ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



రోడ్డుపక్కన పడేసిన చెత్త, వ్యర్థాలు

ధర్మవరంరూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిర మ్మకాలనీకి వెళ్లే రహదారిలో ఎర్ర గుంట ముందర రైల్వేబ్రిడ్జి వద్ద రోడ్డు పక్కనే చెత్తాచెదారం, చికెన్ సెం టర్లలోని వ్యర్థాలను, కోడి ఈకలను వేస్తున్నారు. ఆ ఈకలు గాలికి బైక్‌దారుల కళ్లల్లో పడుతుండటంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతేకాకుండా భరించలేని దుర్వాసన వస్తోంది. పట్టణంలోని చెత్తాచెదారాన్ని ట్రాక్టర్లల్లో తీసుకొని.. రోడ్డుపక్కన వేస్తున్నారు. మున్సిపాలిటీ అధికారులు స్పందించి రోడ్డుపక్కన చెత్తాచెదారాన్ని శుభ్రం చేసేలా, అక్కడ చెత్త, వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కదిరిని అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే



కదిరి : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని, అలాగే ప్రతి కార్యకర్తను కాపాడుకుంటామని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక పీవీఆర్ గ్రాండ్‌లో నిర్వహిం చిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు, కార్యకర్తలు సమస్యలుంటే తనతో నేరుగా మాట్లాడ వచ్చన్నారు. వైసీపీ గడిచిన ఐదేళ్లలో నియోజక వర్గంలో ఒక్క అభివృద్ధీ పనిచేయలేదన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ సభ్యత్వం తీసుకోవాలని, తద్వారా వారికి బీమా వర్తిస్తుందని తెలిపారు. ప్రతి మండలంలో రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే దాదాపు రూ.20కోట్ల పనులు చేపట్టామన్నారు. ఈ సమావేశంలో పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, నాయకులు పర్వీనాభాను, పవన్‌కు మార్‌రెడ్డి, కొమ్మినేని గంగయ్య, అల్పాముస్తఫా, శివరాం ప్రతాప్ రాజశేఖర్‌బాబు, మోపూరిశెట్టి చంద్రశేఖర్, ఎద్దుల క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

● ఖాళీ స్థలానికి పన్ను తప్పని సరి

మున్సిపాలిటీలో ఖాళీ స్థలాలకూ పన్ను తప్పకుండా కట్టాలని, లేనిచో ఇంటిప్లాన్లు, రిజిస్ట్రేషన్లు జరగవని కమిషనర్ కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఎమ్మెల్యే కందికుంట అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనాధికార లేఅవుట్లు, నిర్మాణాలు, ఖాళీ జాగా పన్నులు, రిజిస్ట్రేషన్లు తదితర వాటిపై చర్చించారు. ఇంటి, నీటి పన్నులు బకాయి ఉన్నవారు వెంటనే చెల్లించాలని, అధిక మొత్తంలో పన్ను బకాయి ఉన్నవారి పేర్లు ప్రధాన కూడలిలో ఫ్లెక్సీలు వేస్తామని, నీటి, విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని అన్నారు. అనాధికార నిర్మాణాలకు అనుమతి పొందని పక్షంలో నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేస్తామన్నారు.

సావిత్రిబాయి ఫూలేకు ఘన నివాళి



నల్లమాడ : టీచర్లకు మెమెంటోలు అందచేసిన ఎమ్మెల్యే

నల్లమాడ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో సావిత్రిబాయి ఫూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి శుక్రవారం పూలమాలలు వేసి.. ఘనంగా నివాళులర్పించారు. దేశంలోనే మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా సావిత్రిబాయి ఫూలే విద్యాభివృద్ధికి చాలా కృషి చేశారన్నారు. ఈసందర్భంగా ఉత్తమ అవార్డు పొందిన 30మంది ఉపాధ్యాయురాళ్లకు ఎమ్మెల్యే మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందచేసి సన్మానించారు.

● ధర్మవరం : స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో సావిత్రి ఫూలే జయంతిని నిర్వహించారు. ఇందులో కళాశాల కరస్పాం డెంట్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ బాలంలక్ష్మీ నారాయణరెడ్డి, ప్రిన్సిపల్ హర్షవర్ధన్, కళాశాల ఇన్‌చార్జ్ రమేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

● కదిరి అర్బన్ : పట్టణంలోని కసూరిబా పాఠశాలలో ఎస్ఎఫ్ఐ, ఐద్వా, అలాగే ఎస్సీ బాలికల హాస్టల్‌లో బహుజన ప్రజాపరిరక్షణ సేవాసమితి, బీసీ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సంపంగి గోవర్ధన్ సావిత్రిబాయి ఫూలే చిత్రపటం వద్ద నివాళ్లు అర్పించారు.

● తనకల్లు : మండలంలోని దేవలం తండాలోని ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి ఫూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో ప్రధానోపాధ్యాయులు అలీ, ఉపాధ్యాయులు శివశంకర్, అరుణమ్మ, త్రివేణి, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారుల్లో మార్పు రావాలి : ఎమ్మెల్యే

నల్లమాడ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకునే పద్ధతి సరికాదని, అధికారుల్లో ఇంకా మార్పు రావాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సమస్యలు పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని తమకు అనేక ఫిర్యాదులు అందు తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటివి భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చూసు కోవాలని అధికారులను హెచ్చరించారు. సమస్యలు అధికారుల దృష్టికి వస్తే సత్వరమే పరిష్కరిం చాలని ఆదేశించారు. సమావేశానికి హాజరుకాని అధికారులకు నోటీసులు పంపాలాని ఇన్‌చార్జీ ఎంపీడీఓ రాబర్ట్సువిల్సన్‌ను ఆదేశించారు. సర్పం చ్‌లు, ఎంపీటీసీలు ఆయా గ్రామాల పరిధిలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వీటిని పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈసమావేశంలో ఎంపీపీ సునీతాబాయ్, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

● కిశోర వికాసం

స్థానిక కస్తూరిబా పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసం కౌమార బాలబాలికల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే పాల్గొని పలు సలహాలు, సూచనలు, జాగ్రత్తలు వివరించారు. ఈకార్యక్రమంలో సీఐ నరేంద్రరెడ్డి, కస్తూరిబా ప్రిన్సిపల్ శోభారాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సత్యవతి, ఐసీడీఎస్ డీసీపీయూ సోషల్ వర్కర్ వనజాక్షి పాల్గొన్నారు.

● పాఠశాల తనిఖీ

మండలంలోని రామాపురం వద్ద ఉన్న అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు.

నేడు ఎమ్మెల్యే కందికుంటకు సన్మానం



కరపత్రాలను విడుదల చేస్తున్న చేనేత ప్రముఖులు

ధర్మవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక శివానగర్‌లోని శివాలయ ఆవరణంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను శనివారం ఘనంగా సన్మానిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చేనేత ప్రముఖులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కరపత్రాలను విడుదల చేసిన వారు మాట్లాడారు. పట్టణంలో ఉన్న 80వేల మంది చేనేతలతో పాటు తొగట, దేవాంగ, పద్మశాలి, కుర్ని తదితర చేనేత కుల బాంధవులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో చేనేత పరిశ్రమ, కార్మికు లను కాపాడుకునేందుకు ఈ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత ప్రముఖులు జయశ్రీ, గిర్రాజురవి, పరిశే సుధాకర్, బీరే గోపాలక్రిష్ణ, గడ్డం పార్థసారధి, గుండా పుల్లయ్య, గడ్డం శ్రీనివాసులు, ఉక్కిసిల గోవిందు, బీరే కేశవ, నీలూరి శ్రీనివాసులు, గుద్దుటి రాము, పోలా ప్రభాకర్, పోలా వెంకటనారాయణ, దాసరి రంగయ్య, హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్టాక్‌పాయింట్ తనిఖీ

ధర్మవరంరూరల్ : పట్ట ణంలోని మార్కెట్‌యార్డు నందు ఉన్న ఎంఎల్ ఎస్ రేషన్ స్టాక్ పాయింట్‌ను ఆర్డీఓ మహేష్ శుక్ర వారం తనిఖీ చేశారు. రికార్డులను, స్టాక్‌ను పరిశీ లించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

● **కుణుతూరు ఇళ్లపట్టాలపై విచారణ**

మండలంలోని కుణుతూరు గ్రామంలో జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల పట్టాలపై ఆర్డీఓ విచారణ చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ లేఅవుట్‌లో అనర్హులకు ఇళ్ల పట్టాలు కేటాయించారని, లేఅవుట్‌లో ఉన్న గుడి, బడి, అంగన్‌వాడీ సెంటర్‌లకు కేటాయించిన స్థలాలు కూడా అనర్హులకు అప్పటి అధికారులు కేటాయించారని ఆ గ్రామానికి చెందిన గొడ్డుమర్రి వెంకటేష్, తీర్థప్రసాద్ రాష్ట్ర లోకాయుక్తను ఆశ్రయించారు. అయినా ఆ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు జరుగుతుండటంతో గత నెలలో ఆర్డీఓ మహేష్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం ఆర్డీఓ మహేష్ రెవెన్యూ సిబ్బందితో కలిసి కుణుతూరులోని జగనన్న లేఅవుట్‌ను పరిశీలిం చారు. లేఅవుట్‌లో ఎన్ని ఇళ్ల పట్టాలు ఇచ్చారని, ఎవరెవరూ అర్హులు అని, అనర్హులు ఎంతమంది ఉన్నారో వివరాలను మండల రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఇళ్ల నిర్మాణాలను ఆపాలని సిబ్బందిని ఆదేశించారు. ఫిర్యాదు దారులతో మాట్లాడారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి అనర్హులను తొల గిస్తామని తెలిపారు.

బుక్కపట్నం విద్యార్థికి బంగారు పతకం



గణేష్ రెడ్డి

బుక్కపట్నం, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : స్థానిక బాలుర ఉన్నతపాఠశాలలో పదో తరగతి చదువుతున్న గణేష్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటి.. బంగారు పతకం సాధించారు. గత వారం విజయవాడలోని కృష్ణలంక ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన అండర్ 17 స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 82 కేజీలు, 250 కేజీల విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. శుక్రవారం గణేష్‌రెడ్డిని బుక్కపట్నం పాఠశాలలో హెచ్ఎం జగదీష్, పీడీ నాగరాజు, ఉపాధ్యాయులు అభినందించి, సన్మానించారు.

వీధుల్లో చెత్త తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



చెత్తను తొలగిస్తున్న పంచాయతీ కార్మికులు

కొత్తచెరువు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఏ వీధిలో చూసినా చెత్త కుప్పలు.. కుప్పలుగా ఉంది. దీనిపై ఓ కథనం శుక్రవారం ఆంధ్రజ్యోతి ప్రచురించింది. దీనికి స్పందించిన పంచాయతీ అధికారులు ఉర్దూ పాఠశాల వద్ద చెత్త కుప్పను తొలగిం చారు. అదే విధంగా వీధుల్లో ఉన్న చెత్తకుప్పలను సైతం కార్మికులు తొలగించారు. దీంతో వీధులన్నీ శుభ్రమయ్యాయి.

చలో విజయవాడను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న విశ్వహిందూపరిషత్ సభ్యులు

ధర్మవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూపరిషత్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే హైందవ శంఖారావం చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విశ్వహిందూపరిషత్ విభాగ్ కార్యదర్శి పులిచెర్ల వేణుగోపాల్, ఉపాధ్యక్షులు పోలిశెట్టి వెంగముని పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో వారు మాట్లాడారు. చలో విజయవాడ కార్యక్రమానికి లక్షలాది మంది తరలిరావాలన్నారు. దేవాలయ భూములను రక్షించాలని, ఆలయాలపై దాడులను, హిందూవులపైన దాడులు నిరసిస్తూ హిందూవులందరూ సంఘటితం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ సత్సంగప్రముఖ్ వేదవ్యాసు, దేవరకొండ రామానుజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల ఊసే లేదు

తాడిమర్రి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు సమస్యలు రాజ్యమేలుతున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం వాటి గురించి చర్చించకుండా.. మండల సర్వసభ్యసమావేశాన్ని మమ.. అనిపించారు. ఎంపీపీ భువనేశ్వరరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఎలాంటి తీర్మానాలూ చేయలేదు. మండలాన్ని తీవ్ర కరువు ప్రాంతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో.. స్థానికప్రజాప్రతినిధుల ఆమోదంతో నిధులు అదనంగా తీసుకువచ్చి మండలాన్ని అభివృద్ధి చేయాల్సిన అధికారులు అటువైపుగా దృష్టిసారించడం లేదు. మరో వారం రోజుల్లో కేంద్ర బృందం మండలంలో పర్యటించనుంది. ఇలాంటి తరుణంలో కూడా అధికారులు, ప్రజాప్రతినిధులు ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని ప్రజలు విమర్శిస్తున్నారు.

న్యూస్ బాక్స్

రాష్ట్రస్థాయికి ఎంపికైన పులేరు సైన్సు ప్రాజెక్టు



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థినులు

గోరంట్ల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులేరు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల 9వతరగతి విద్యార్థినులు హర్షిత, కావ్యశ్రీలు రూపొందించిన సైన్సుప్రాజెక్టు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు గైడ్ టీచర్ గంగాధరప్ప ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విద్యార్థినులు రూపొందించిన 'స్మార్టు ఎలక్ట్రికల్ సిస్టమ్' అనే సైన్సు ప్రాజెక్టు శుక్రవారం పుట్టపర్తి సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి సైన్సు ఫెయిర్‌లో ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపికైనట్లు పేర్కొన్నారు. దీంతో వారికి ప్రశంసాపత్రాన్ని, షీల్డును బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్‌ప్రసాద్ ఎంపికైన విద్యార్థినులను, సైన్సుటీచర్ గంగాధరప్పను అభినందించారు.

బీటీ రోడ్డును మంజూరు చేయండి

సోమందేపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిదడకల పంచాయతీ గ్రామాలైన మరువకుంటపల్లి, పత్తికుంటపల్లి, పెద్దరెడ్డిపల్లి గ్రామాల నుంచి చాలకూరుకు వెళ్లే మట్టి రహదారికి బీటీ రోడ్డు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరారు. గురువారం స్థానిక ప్రజలు ఈమేరకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు లేఖ రాశారు. వారు మాట్లాడుతూ కదిరి, హిందూపురం మీదుగా పత్తికుంటపల్లి నుంచి చాలకూరుకు 2.5కి.మి. మట్టి రోడ్డు ఉందని, నిత్యం గర్భిణులు, విద్యార్థులు, రైతులు ఈ రహదారిగుండా ప్రయాణం సాగిస్తుంటారన్నారు. ఓ టీడీపీ కార్యకర్త ఎకరం పొలం కోల్పోయి ఈ రోడ్డుకోసం ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి బీటీ రోడ్డు మంజూరు చేయాలని కోరారు. కాపీ ప్రతిని మంత్రి సవితకు, జిల్లా కలెక్టర్‌కు పంపించినట్లు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

లేపాక్షి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని మండలంలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు శుక్రవారం ఎంపీడీఓ నరసింహమూర్తికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులను ఏకవచనంతో సంబోధిస్తున్నారని, అత్యవసరంలో సెలవులు మంజూరు చేయడం లేదన్నారు. నిరంకుశంగా వ్యవహరించడం వ్యక్తిగత కక్షలకు దిగడం, జీతాల బిల్లు సకాలంలో పెట్టకుండా ఇబ్బందులు కలిగించడం, పెన్షన్ పంపిణీ తదితర సమస్యలపై ఎంపీడీఓకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు ఆటల పోటీలు


షాట్‌పుట్ విసురుతున్న అంధ విద్యార్థులు

హిందూపురం అర్బన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): లూయిస్ బ్రెయిలీ 216వ జయంతిని పురస్కరించుకొని అంధ విద్యార్థులకు శుక్రవారం స్థానిక ఎంజీఎం పాఠశాలలో ఆటలపోటీలను ఏర్పాటు చేశారు. విజువల్ ఇంపాక్ట్, డెవలప్‌మెంట్ అసోసియేషన్(విఐడిఏ) ఆధ్వర్యంలో సేవా మందిరం అంధుల పాఠశాల విద్యార్థులకు ఆటలు, పాటలు, షాట్‌పుట్, డిస్కస్‌త్రో తదితర పోటీలతో పాటు సాయంత్రం పాటల పోటీలు నిర్వహించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు శనివారం లూయిస్ జయంతి వేడుకల సందర్భంగా బహుమతులు అందించనున్నారు.

బాల్య వివాహాల నివారణకు కృషిచేయాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీడీఓ, సీడీపీఓ

అగళి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సీడీపీఓ నాగమల్లీశ్వరి పేర్కొన్నారు. అగళి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం బాల్యవివాహాల నివారణపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ యాదవేంద్ర, ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు డా.గాయిత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం చేయాలని అలా కాకుండా చేస్తే ప్రభుత్వం తగిన గుణపాఠం నేర్పుతున్నారు. భేటీ బచావ్ బేటీ బడావో అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు ఈ కార్యక్రమంలో డా.గాయిత్రి, వెలుగు ఏపీఎం సురేష్, ప్రధానోపాధ్యాయుడు, రవీంద్ర మూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లీలావతి, సన్నక్క, పిహెచ్ఎన్ లక్ష్మీదేవి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలకృష్ణని విమర్శించే స్థాయి ఉషకు లేదు


విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చిలమత్తూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణని విమర్శించే స్థాయి వైసీపీ నాయకులకు లేదని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్, శ్రీదేవి, తిప్పారెడ్డి, బాలాజీ, మాజీ ఎంపీటీసీ సూరి, సోమశేఖర్, లక్ష్మీనరసప్ప తదితరులు విలేకరులతో మాట్లాడుతూ ఉషశ్రీ చరణ్ ఎమ్మెల్యేపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, అది మంచి పద్ధతి కాదన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజల సురక్షితంగా ఉన్నారని, అదే వైసీపీ ప్రభుత్వంలో రాక్షస పాలన సాగిందన్నారు. కళ్యాణదుర్గంలో ఆమె హయాంలో అరాచకాలు ఎలా జరిగాయో అందరికీ తెలిసిందేనన్నారు. బాలయ్యపై ఏది పడితే అది మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

అందుబాటులోలేని అరుదైన రక్తం



● రక్తదాన శిబిరాలకు ముందుకు రాని దాతలు

● పెనుకొండలో నెగిటివ్ బ్లడ్ గ్రూపు కోసం ఇక్కట్లు

పెనుకొండ టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నిత్యం 44వ జాతీయ రహదారిపై పెనుకొండ సమీపంలో ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. అలాగే పెనుకొండ డివిజన్ కేంద్రం కూడా కావడంతో పెద్దఎత్తున గర్భిణులు ప్రసవాలకు వస్తుంటారు. ఈ నేపథ్యంలో అత్యవసర సమయాల్లో పెనుకొండ ఆస్పత్రికి వచ్చేవారికి పాజిటివ్ బ్లడ్ మాత్రమే అందుబాటులో ఉంటోంది. అరుదైన నెగిటివ్ బ్లడ్ గ్రూపులు అందుబాటులో ఉండడంలేదు. దీంతో అత్యవసర చికిత్సకువచ్చే అరుదైన నెగిటివ్ బ్లడ్‌గ్రూపులు కలిగినవారు నానా అగచాట్లు పడుతున్నారు.

200 యూనిట్లు ఉండాల్సిన చోట 16 యూనిట్లు మాత్రమే

పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌లో 200యూనిట్లు నిలువ చేసే అవకాశం ఉంది. అయితే ఓ పాజిటివ్ 4యూనిట్లు, బీ పాజిటివ్ 4, ఏ పాజిటివ్ 4, ఏబీ పాజిటివ్ 4, ఇలా 16యూనిట్లు మాత్రమే రక్తం అందుబాటులో ఉంది. మిగిలిన అరుదైన ఏ నెగిటివ్, బి నెగిటివ్, ఓ నెగిటివ్, ఏబి నెగిటివ్ బ్లడ్ అందుబాటులో ఉండడంలేదు. అలాంటి బ్లడ్ గ్రూపు కలిగిన వారికి రక్తం అవసరమైతే ఇతర ప్రాంతాలకు పరుగులు పెట్టాల్సి వస్తోంది.

గర్భిణులకు మాత్రమే..

బ్లడ్ క్యాంపుల ద్వారా సేకరించిన రక్తాన్ని హిందూపురానికి తరలించి అక్కడ హెచ్ఐవి, హెచ్‌బిఎస్ఏజి, వీడిఆర్ఎల్, హెచ్‌సివి, ఎంపి వంటి వ్యాధి పరీక్షలు నిర్వహించి స్వచ్ఛమైన బ్లడ్‌ను గుర్తించి స్టోరేజ్ పాయింట్లకు పంపుతారు. ప్రస్తుతం కాన్పులకు వచ్చే గర్భిణులకు మాత్రమే అత్యవసరంలో అందించేందుకు కొన్ని రకాల రక్తం అందుబాటులో ఉంచారు. అదికూడా 35రోజుల పాటు నిలువ ఉంటుంది. అనంతరం అది నిరుపయోగంగా మారుతుంది.

రక్తదాతలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి

పెనుకొండ పరిసర ప్రాంతాల్లో రక్తసేకరణ కోసం రక్తదాన శిబిరాలు నిర్వహిస్తే దాతలు ముందుకు రావడం లేదు. రక్తం ఇచ్చే దాతలకు అవగాహన కల్పించలేక పోతున్నారన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం ఏడాదికి ఆరేడు క్యాంపులు మాత్రమే నిర్వహిస్తున్నారు. అదికూడా పోలీసు అమరవీరుల దినోత్సవం, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రముఖుల వర్ధంతి జరిగినప్పుడు మాత్రమే శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో సేకరించిన బ్లడ్‌ను హిందూపురం ఆసుపత్రికి తరలించి పలు పరీక్షలు నిర్వహించి పెనుకొండ బ్లడ్ స్టోరేజీ పాయింట్‌కు తరలిస్తారు. టీటీడీలాగా రక్తదాతలకు ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరముంది.

రక్తదాతలు ముందుకు రావాలి


డాక్టర్ భాను నాగేశ్వరి

బ్లడ్ క్యాంపుల ద్వారా దాతల నుంచి రక్తం సేకరిస్తున్నాం. ప్రస్తుతం పాజిటివ్ బ్లడ్ మాత్రమే అందుబాటులో ఉంది. వేసవి కాలంలో ఎక్కువ క్యాంపులు చేసి రక్తం నిల్వ చేస్తున్నాం. అరుదైన బ్లడ్‌గ్రూపులు కలిగిన దాతలు ఉదారంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి.

ఇరిగేషన్‌లో నిధులు లేక స్తంభించిన పనులు

● చేసిన పనులకు రూ.20లక్షల బకాయిలు

● బిల్లుల కోసం కార్యాలయం చుట్టూ తిరగాల్సిందే


మధూడి చెరువులో పెరిగిన కంపచెట్లు

మడకశిర, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మైనర్ ఇరిగేషన్ శాఖ పరిధిలో ఐదు సంవత్సరాలైనా నిదులు మంజూరు కాక పోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ప్రతిపాదనలు పంపడమేగాని నిధులు మంజూరుకాక పోవడంతో చెరువులు మరమ్మతులకు నోచుకోవడంలేదు. కర్ణాటక సరిహద్దు ప్రాంతం అయిన మడకశిర నియోజకవర్గంలో ఎటువంటి సాగు నీటి వనరులు లేక పోవడంతో ఈ ప్రాంత రైతులు వర్షాధార పంటలు, బోర్ల కింద పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వర్షాలు కూడా అంతంత మాత్రంగా కురుస్తున్నాయి. చెరువులో పూడిక పేరుకునిపోయి కంపచెట్లు పెరిగి కట్టలు దెబ్బతినడం , తూములు లీకేజీతో కురిసిన వర్షపు నీరంతా వృధాగా పోతోంది. తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. చేసిన పనులకు నేటికి బిల్లులు మంజూరు కావడం లేదు. పనులు చేసిన వారు బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తాము చేసిన పనుల కు బిల్లు లు అందుతాయన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు.

మూడేళ్లుగా అందని బిల్లులు

2021-2022సంవత్సరంలో నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షాల కారణంగా వచ్చిన వరదలకు దెబ్బతిన్న చెరువులు, కాలువలకు అప్పట్లో ఇరిగేషన్ శాఖవారు, చెరువు ఆయకట్టు దారులతో కలసి మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులు చేపట్టిన దానికి ఖర్చుపెట్టిన రూ.20లక్షలు నేటికి మంజూరు కాలేదు. అందులో మడకశిర సబ్‌డివిజన్ పరిధిలోని వైబి హళ్ళి చెరువుకు రూ.1.80 లక్షలు, చౌటిపల్లి చెరువుకు రూ. 1.80లక్షలు, గుడిబండ మండలం కరికెర చెరువుకు లక్ష రూపాయిలు, అమరాపురం చెరువుకు రూ. 1.20 లక్షలు, రంగనాథ చెరువుకు రూ.1.20 లక్షలు చెల్లించాల్సి ఉంది. అగలి మండలంలోని అగలి పెద్ద చెరువు, రొళ్ళ మండలం పిల్లిగుండ్ల చెరువుకు చేపట్టిన మరమ్మతులకు కూడా బిల్లులు చెల్లించాల్సి ఉంది.

నిధులు మంజూరైన వెంటనే చెల్లిస్తాం : ఇరిగేషన్ శాఖ ఏఈ

2021-22 సంవత్సరంలో నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న చెరువులకు, కాలువలకు తాత్కాలికంగా మరమ్మతులు చేశారు.. పనులు చేసిన వారికి రూ.20లక్షల దాకా బిల్లు లు చెల్లించాల్సి ఉంది. నిధులు మంజూరయిన వెంటనే వారికి బిల్లులు చెల్లిస్తాం.

సావిత్రిబాయి పూలే పోరాటం అమోఘం

● జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు


సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే స్త్రీ విద్య కోసం ఎంతోకృషి చేశారని, మూఢ నమ్మకాలు, సాంఘిక దురాచారాలు, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఎంతగానో పోరాడారని టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత సమాజాన్ని సంస్కరించడానికి జన్మించిన గొప్ప మహిళ సావిత్రిబాయి పూలే అన్నారు. మహిళా అభ్యుదయానికి బాలికల విద్యకు నిత్య స్ఫూర్తి ప్రదాతగా ఆమెచరిత్రలో నిలిచిపోయారన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, యూటీఎఫ్ సంఘం గౌరవాధ్యక్షులు భూతన్న, నాయకులు జోగన్న, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాపూలే జయంతి

పెనుకొండ రూరల్: సావిత్రిబాపూలే జయంతిని గుడిపల్లి ఎంపీయూపీ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు.


రేకలకుంటలో మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

హిందూపురం అర్బన్: స్థానిక ఎస్‌డిజిఎస్ కళాశాలలో, ఎన్ఎస్‌పిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో, బిఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో సావిత్రీబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు.

మడకశిర రూరల్: సావిత్రిబాయి పూలేని బాలికలు ఆదర్శంగా తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు గిరిజ, భూతన్న పేర్కొన్నారు. జాతీయ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం, సావిత్రిబాయిపూలే జయంతిని నియోజకవర్గంలోని పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు.

పావగడ :మహిళలకు అక్షరాస్యత అందించి హక్కులు పొందేలా చేసిన సావిత్రిబాపూలే జయంతిని పావగడ పట్టణంలోని స్వచ్ఛంద సేవాసంస్థలు తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు.

గుడిబండ: గుడిబండ మహాత్మా జ్యోతిరావుపూలే బాలికల గురుకుల కళాశాలలో 193వ సావిత్రిబాయిపూలే జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్ పాల్గొన్నారు.

కిశోరీ వికాసంతో బాలికలకు మంచి భవిష్యత్తు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శేఖర్

గోరంట్ల,జనవరి3 (ఆంధ్రజ్యోతి): కిశోరీ వికాసం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం బాలికలకు మంచి భవిష్యత్‌ను అందిస్తోందని ఐసిడిస్ అధికారులు తెలిపారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండలస్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని మహిళ పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, నోడల్ ఉపాధ్యాయులు, ఆర్పీఎస్‌లు శిక్షణలో పాల్గొన్నారు. సీఐ శేఖర్ మాట్లాడుతూ, వ్యవస్థలో మార్పు రావాలంటే పోలీసు శాఖతోపాటు శిశు సంక్షేమ తదితర శాఖలు సంయుక్తగా పనిచేసినప్పుడే ఫలితముంటుందని తెలిపారు ఈకార్యక్రమంలో ఎంపీపీ ప్రమీల, ఎంపీడీఓ నరేంద్రకుమార్, చైల్డు ప్రొటెక్షన్ అధికారి మహేష్, ఐఓఆర్‌డి శివన్న, ఎసీడీపీఓ గీతాబాయి, ఏపీఎం నాగమణి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బాలికలకు బంగారు భవితే లక్ష్యం

లేపాక్షి, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : బాలికల బంగారు భవితే లక్ష్యమని సీడీపీఓ శాంతి అన్నారు. శుక్రవారం స్థానిక ఉర్దూ పాఠశాలలో కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉజ్వల ఆరోగ్యకరమైన సాధికారిత దిశగా ఆడపిల్ల వేసే ప్రతి అడుగుకు సమిష్టి కృషితో చేయూతనిద్దామన్నారు. కిశోర వికాసం పోస్టర్లను ఆవిష్కరించి ప్రతి బాలిక భవిష్యత్తును మెరుగు పరచడానికి ఇది ఒక మంచి అవకాశమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంఈఓ నాగరాజునాయక్, అంగనవాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చేతుల్లోనే బాలికల భవిష్యత్తు

గుడిబండ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల బంగారు భవిషత్తు తల్లిదండ్రుల చేతుల్లోనే ఉంటుందని ఎంపీడీఓ గంగాధర్, సీడీపీఓ శాంతలక్ష్మీలు పేర్కొన్నారు. గుడిబండలో శుక్రవారం కిశోరీ వికాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు బాలికలను చదివించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు.

తల్లిదండ్రులు పిల్లలకు క్రమశిక్షణను నేర్పించాలి

అగళి, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు పిల్లలకు మంచి భవిష్యత్తును, క్రమశిక్షణను నేర్పించి విద్యావంతులను చేసేందుకు కృషిచేయాలని ఎంఈఓలు భాస్కర్, చంద్రశేఖర్‌నాయుడులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ జాఫర్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థులు సక్రమంగా పాఠశాలకు హాజరు కాకపోవడంతో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆదేశాల మేరకు మరోసారి తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. పిల్లలకు విద్య ఉన్నప్పుడే సమాజంలో గౌరవం ఉంటుందని ముందుకు వెళ్తారని వారు తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచ్ రవికుమార్, స్కూల్ కమిటీ ఛైర్మన్ ఆశ, రిటైర్డ్ ఉద్యోగి వెంకట శివప్ప, వైస్ ఛైర్మన్ సరస్వతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తమిళనాడు వరద బాధితులకు జపానందస్వామి సాయం


బాధితులకు సహాయాన్ని అందజేస్తున్న పావగడ జపానందస్వామి

పావగడ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల సంభవించిన తమిళనాడులో ఫంగల్ తుపానుతో ఇబ్బందులకు గురైన నిరుపేద కుటుంబాలకు పావగడ రామక్రిష్ణ సేవాశ్రమ పీఠాధిపతి జపానందస్వామి ఇన్ఫోసిస్ సంస్థ సహకారంతో ఆపన్న హస్తాన్ని అందజేశారు. 450కి.మి. దూరంలో ఉన్న తమిళనాడులోని తిండివనంలో నీటిలో కూరుకుపోయి ఆకలితో కొట్టుమిట్టాడుతున్న 4వేల కుటుంబాలకు ఆసరాగా ఆహారకిట్‌లు, వస్త్రాలు అందించి మానవత్వం చాటుకున్నారు. దేశంలోని ఆరు రాష్ట్రాల్లో 26,500 కుటుంబాలకు సహాయాన్ని అందించినట్లు తెలిపారు.

శ్రామికజీవుల వ్యథలే షరీఫ్ కథలు



షరీఫ్ రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

పెనుకొండ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సాహితీ అకాడమి యువ పురస్కార గ్రహీత డా.వేంపల్లి షరీఫ్ రచించిన కథలు శ్రామికజీవుల వ్యథలని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాష పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంక్యూవి గ్లోబుల్ ట్రస్ట్ జిల్లారచయితల సంఘం ఆధ్వర్యంలో కోగిర జయచంద్ర అధ్యక్షతన షరీఫ్ పుస్తక పరిచయ సభ ఏర్పాటు చేశారు. ఆయన రచించిన చారలపల్లి కథల పుస్తకాన్ని పరిచయం చేశారు. ఈ సభకు జాబిలిచాంద్‌బాష, ఎస్ఎస్‌వై గురూజీ రవిశంకర్ గురూజీ, గ్లోబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కలీముల్లా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చాంద్‌బాష మాట్లాడుతూ వేంపల్లి షరీఫ్ కథలు నేటి సమాజంలోని బడుగు బలహీనవర్గాల జీవన వ్యథలన్నారు. దేశ సౌభాతృత్వాన్ని పెంపొందించేలా ఈ పుస్తకంలోని కథలను మనం చూడవచ్చన్నారు. వేంపల్లి షరీఫ్ మాట్లాడుతూ తాను పుట్టిపెరిగిన తన ఊరు తన ప్రాంతపు ప్రజలు, పల్లెబాట, చుట్టూ ఉన్న పరిస్థితులు, తనకు కథలు రాయడానికి ప్రేరణ అన్నారు. ఈ కార్యక్రమంలో మూర్తి, నారాయణస్వామి, క్రిష్టఫర్, అహ్మది, జాన్‌ప్రియనాథ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వేంపల్లి షరీఫ్‌ను ఘనంగా సత్కరించారు.

వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్‌ను కలిసిన పెనుకొండ నాయకులు

పెనుకొండ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్టేట్ మైనార్టీ వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్ అబ్దుల్ అజీజ్‌ను పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు నిస్సార్ అహ్మద్, సనావుల్లా, అబ్దుల్ సలాం తదితరులు శుక్రవారం విజయవాడలోని వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో కలిసి పూలమాలలువేసి శాలువాకప్పి సన్మానించారు. అనంతరం పెనుకొండ పట్టణంలో ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఛైర్మన్‌తో చర్చించినట్లు తెలిపారు.

8న బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన

అమరాపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గం బేగార్లపల్లి గ్రామంలో ఈనెల 8వతేదీన అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రావుల విగ్రహ ప్రతిష్ఠాపనకు మండలంలోని అన్ని గ్రామాల నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని మండల కన్వీనర్ గణేష్ కోరారు. అమరాపురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ మేరకు ఆయన విజ్ఞప్తిచేశారు.

రాగి పంట సాగు లాభదాయకం

చిలమత్తూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభదాయకమైనది రాగి పంట సాగు అని మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని వీరాపురం రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రాగి పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.

క్రైం కార్నర్

అస్వస్థతతో విద్యార్థిని మృతి

హిందూపురం అర్బన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అజీరా(16)అకస్మాత్తుగా మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. ప్రిన్సిపాల్ తెలిపిన వివరాల మేరకు ప్రతిరోజులాగే సాయంత్రం కళాశాల సమయం ముగిసిన తరువాత ఇంటికి వెళ్ళడానికి ఆ విద్యార్థిని గేటు వరకు వచ్చింది. అప్పటికే విద్యార్థిని తండ్రి ఆమెను తీసుకెళ్ళడానికి కళాశాల వద్ద వేచిఉన్నాడు. ఇంతలో విద్యార్థిని అస్వస్థతకు గురై కింద పడిపోయింది. తోటి విద్యార్థినులు, ఉపాధ్యాయురాలు వచ్చి సపర్యలు చేశారు. ఇంతలో తండ్రి అక్కడకు చేరుకొని పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్ళాడు. అక్కడ వైద్యులు పరిశీలించి పల్స్ తక్కువగా ఉందని, ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించినట్లు తెలిసింది. అక్కడకు వెళితే వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. ఆ విద్యార్థిని చదువులో కూడా ముందుంటుందని, విద్యార్థిని మృతి అందరిని కలచివేసిందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


మృతి చెందిన క్రిష్టప్ప (ఫైల్)

మడకశిర రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) మండలంలోని బుళ్ళసముద్రం గ్రామానికి చెందిన క్రిష్టప్ప అనే వ్యక్తి బుధవారం రాత్రి గౌడనహళ్ళి గ్రామం వద్ద రోడ్డు ప్రమాదానికి గురికాగా, అతనిని వెంటనే కుంటుంబసభ్యులు బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందనట్లు ఆయన తండ్రి లక్ష్మీనరసప్ప, మాజీ సర్పంచు జైపాల్ తెలిపారు. ఈ విషయమై మడకశిర పోలీసులకు పిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ప్రభుత్వం అతడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

ద్విచక్రవాహన ప్రమాదంలో ఇరువురికి గాయాలు

గోరంట్ల, జనవరి3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్డిచెరువుపల్లికి వెళ్లే రహదారిలో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో వేణుగోపాల్, నాగమ్మలు శుక్రవారం తీవ్రంగా గాయపడ్డారు. సోమందేపల్లి మండలంలోని నాగినాయనచెరువు గ్రామానికి చెంది వేణుగోపాల్ గోరంట్ల మండలంలోని గ్రామాల్లో రోడ్డు పనులు నిర్వహిస్తున్నారు. వాటి పర్యవేక్షణ కోసం ద్విచక్రవాహనంపై రెడ్డిచెరువుపల్లికి వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. రహదారిపై వెళ్తున్న వృద్ధురాలు నాగమ్మ అడ్డురావడంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో ఇరువురు గాయపడ్డారు. వెంటనే 108లో గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, డాక్టర్ ఉష చికిత్స చేశారు. నాగమ్మకు ఎడమచేయి విరగగా, వేణుగోపాల్ తీవ్రంగా గాయపడ్డారు. ఇరువురిని మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

సుఖాంతమైన మిస్సింగ్ కేసు

పెనుకొండ రూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కియా ఇండస్ట్రీయల్ పరిధిలో అదృశ్యమైన యువతి కేసును పోలీసులు ఛేదించారు. మండలంలోని అమ్మవారిపల్లి గ్రామానికి చెందిన యువతి డిగ్రీ చదువుతోంది. డిసెంబర్ 27నుంచి కనబడడంలేదని తల్లి ఉమాదేవి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేశారు. కాని ఆమె తాను ప్రేమించిన యువకుడితోను, అత్తా మామలతోను కలిసి శుక్రవారం కియా పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. తాము ఇష్టపూర్వకంగా పెళ్లి చేసుకున్నామని తెలపడంతో వారిని పెనుకొండ తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు కియా ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.